3.1.1997 శుక్రవారం 12 పేజీలు ...... విడిప్రతి రూ.2.00లు Phone: 27354 Regd. No. HNL 18

జమీన్‌రైతు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు   జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

శుభాకాంక్షలు

మిత్రులు శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.

రొటేరియన్ P.H.F. డి.సి. హరిబాబు

రాఘవేంద్ర కలర్ ఆటో జెరాక్స్ నెల్లూరు.

జన్మభూమి రాజకీయం ఫలించింది!

ముఖ్య మంత్రి చంద్ర బాబు నాయుడు ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన జన్మభూమి కార్యక్రమం ఆచరణలో తుస్సుమన్నా – ఆయనకు కావలసిన రాజకీయ ప్రయోజనం మాత్రం బాగా లభించింది. విచిత్రంగా, కాకతాళీయంగా ప్రారంభ మైంది ఈ కార్యక్రమం. జనవరి మొదటి వారం నుంచి శ్రమదానం కార్యక్రమం, ప్రజల వద్దకు పాలన, మైక్రో లెవల్ ప్లానింగ్ కార్యక్రమాలను పునః ప్రారంభిస్తున్నామని చెప్పడానికి పత్రికల వారిని పిలిచారు. ఆయన ప్రసంగంలో యథాలాపంగా జన్మభూమి అనేమాట దొర్లింది; ఒక పత్రికా విలేఖరి ఆ మాటను ప్రసావించి మీ కొత్త కార్యక్రమం పేరు జన్మభూమి అంటే బాగుంటుంది అని వ్యాఖ్యానించాడు. ప్రక్కరోజు పత్రికలలో అదే పేరు ప్రచురిత మైంది. అప్పటి వరకు చంద్ర బాబుకు జన్మభూమి అనే ఆలోచనే లేదు. కానీ పత్రికలలో వార్తలు వచ్చిన తర్వాత – ఇదేదో బాగుందే అనుకొని – తన మూడు కార్యక్రమాలనూ కలిపి ఒకే నినాదంతో అమలు జరిపితే బాగుంటుందనే వుద్దేశ్యంతో – డాక్టర్ సి. నారాయణ రెడ్డి వంటి కవులను పిలిపించి కొత్తపేరు సూచించమని అడిగారు. కాని వారిచ్చిన పేర్ల కంటే జన్మభూమి అనే పేరే బాగుందని

> దివాలా ఖజానా, మంత్రిత్వపు అసంతృప్తి, మద్యపాన ఆగ్రహాల నుంచి అందరి దృష్టి మళ్లించడంలో చంద్రబాబు సఫలీకృతుడైనాడు!

అధికారులు పలువురు చెప్పడంతో – దాన్ని ఒక నినాదంగా ప్రకటించాడు ముఖ్యమంత్రి. ఇదీ ఈ పథకం నేపథ్యం.

అయితే పత్రికలు దీనికి విశేష ప్రాధాన్యత ఇస్తున్నాయి. కూతల ఆర్భాటం తప్ప కుప్పలో గింజలు లేవనే సామెత పూర్తిగా అన్వయిస్తుంది దీని విషయంలో! ప్రభుత్వం నుంచి ఒక్క పైసా నిధులు ఖర్చు పెట్టకుండా, చిల్లిగవ్వ అభివృద్ధి కార్యక్రమం చేపట్టకుండా, ఒక్క రోడ్డు వేయకుండా, ఒక్క భవనం కట్టకుండా, ప్రజలకు మేలు జరిగే ఏ పని చేయకుండా – ప్రజల కోసం ప్రభుత్వం చాలా కష్టపడు తున్నదనే భ్రమ కల్గించ డానికి అనువుగా రూపొందించారు దీన్ని. భోజనం కూడా పెట్టకుండా విద్యార్థులను గ్రామాలకు తరమడం ద్వారా సిబ్బంది ఖర్చు తప్పింది. గోడలకు సున్నం కొట్టడం ఒక్కటే జన్మభూమి చేసే పని. దానికి కూలీల బెడద లేదు – విద్యార్థుల చేతనే వెల్ల వేయిస్తున్నారు.

రాజకీయంగా ఎదుర్కొంటున్న సమస్యలను జన్మభూమి ద్వారా వాయిదా వేయాలనే చంద్రబాబు రాజకీయపు ఎత్తుగడ బాగా ఫలించింది. మంత్రిత్వాల అసమ్మతితో, పనులు జరగడం లేదనే ఆక్రోశంతో ఎగిరెగిరి పడుతుండిన తెలుగు ఎమ్మెల్యే లందరినీ గ్రామాలకు తరిమి వారి దృష్టి మరలింప జేశారు. మద్య నిషేధం ఎత్తి వేస్తారనే ప్రచారంతో కోపంతో వున్న మహిళల ఆలోచనలు దారి మరల్చ డానికి దీన్ని బాగా వాడుకొంటున్నారు. దివాలా తీసిన ఖజానాతో ప్రభుత్వ నిర్వీర్యమై పోయిందనే నింద పెద్దది కాకుండా ఏదో చేసేస్తున్నా మన్న భ్రమ కల్పిస్తున్నారు.

ఇదంతా పత్రికల ప్రచారం వరకే పరిమితం. ఆచరణలో జరుగు తున్నది ఆవగింజంత అయితే – పత్రికా వార్తలలో కొండంతగా చూపిస్తున్నారు. ప్రభుత్వం ఎంత నిర్బంధం చేసినా, కలెక్టర్ల ద్వారా బెదరింపులు చేసినా ఆశించినంత మంది విద్యార్థులు గ్రామాలకు వెళ్లలేదు. వెళ్లిన వారు చేస్తున్న పనీ లేదు. ముఖ్య మంత్రి మాత్రం ప్రచారార్భాటంతో పత్రికల వారిని వెంట బెట్టుకొని ముందుగా నిర్ణయించిన గ్రామాలకు వెళ్తున్నారు. అక్కడ ఒక బ్రష్‌తో సున్నం పూసి, ఒక పారతో మట్టి త్రవ్విపోసి పత్రికలలో కలర్ ఫోటోలు వేయించు కొంటున్నారు. దానితో రాష్ట్ర మంతటా జన్మభూమి గ్రాండ్ సక్సెస్ అన్పింప జేస్తున్నారు. ఒక్క పత్రికా లేదా టివి ఈ కార్యక్రమాన్ని విమర్శ నాత్మకంగా విశ్లేషించడం లేదు. చంద్రబాబు చెప్పిన

కొరవ 7 పేజీలో

రొయ్యలకు అడుగడుగున గండాలే!

రొయ్యల పరిశ్రమను ఏదో దుష్టశక్తి ఆవహించి నట్లుంది; విడవని గ్రహణం ఏదో పట్టి పీడిస్తున్నది. ఎన్ని సమస్యలు? ఎన్ని కష్టాలు? ఎన్ని గండాలు? ఎన్ని కడగండ్లు? ప్రారంభం నుంచీ అంతే! దినదిన గండం నూరేళ్లాయుష్షు అన్న తీరులో నడుస్తూందీ పరిశ్రమ. ప్రపంచంలో, మరే పరిశ్రమా ఈ తీరులో, ఈ వేగంతో ప్రాభవం పొంద లేదు; ఈ రీతిలో, ఈ విధంలో కష్టాల పాలూ కాలేదు. ఉండే కష్టాలు చాలవన్నట్లు సుప్రీం కోర్టు తీర్పు తలపై పడింది; అది మూలిగే నక్కపై తాటికాయ చందంగానే వుంది!

రొయ్యల పరిశ్రమ భవితవ్యంపై 110 పేజీల మరణ శాసనం లిఖించింది సుప్రీం కోర్టు. మద్రాసుకు చెందిన సంఘ సేవకుడు, సర్వోదయ నాయకుడు శ్రీ ఎస్. జగన్నాథ్ తీర ప్రాంతంలో రొయ్యల పరిశ్రమ వల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడు తున్నదని, దాన్ని నివారించాలని సుప్రీం కోర్టులో ఒక ప్రజాప్రయోజనకర వ్యాజ్యం దాఖలు చేశారు. 1994లో దాఖలైంది కేసు. ఈ రెండేళ్ల కాలంలో సుప్రీం కోర్టు చాలా సమగ్రమైన, సవివరమైన విచారణ జరిపింది. కేంద్రంతో పాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు; ఆక్వా కల్చర్ సంస్థలు, సంఘాలు తమ వాదనలు విన్పించాయి. కపిల్ సిబాల్ వంటి సీనియర్ అడ్వకేట్లు 11 మంది; సీనియర్ అడ్వకేట్లు 70 మంది ఈ కేసులో తమ వాదాలు విన్పించారు. సుప్రీం కోర్టు దీనిపై నాగపూర్‌లోని నీరి (ఎన్ఇఇఆర్ఐ) అనే ప్రభుత్వ రంగ పర్యావరణ పరిశోధనా సంస్థను రొయ్యల పరిశ్రమ, పరిసరాలపై దాని ప్రభావం అధ్యయనం చేయమని పురమాయించింది; వారు మొదట ఒక నివేదిక

> మత్స్యకారుల ప్రతిఘటన,
> ఎగుమతి సంస్థల ధరల దోపిడీ,
> పత్రికల ప్రతికూల ప్రచారం,
> వైరస్ వ్యాధులతో సతమతమౌతున్న రైతుల నెత్తిన తాటికాయ వలె పడింది తీర్పు!

ఇచ్చారు; అందులో తలెత్తిన ప్రశ్నలకు సమాధానాలు కనుగొన డానికి అదే సంస్థకు చెందిన ఒక నిపుణుల సంఘం ద్వారా మరొక పరిశీలన జరిపించింది సుప్రీం కోర్టు.

ఈ నివేదికలతో పాటు జాతీయ, అంతర్జాతీయ చట్టాలను; సమావేశాలు, సదస్సుల నివేదికలను చాలా క్షుణ్ణంగా అధ్యయనం చేసింది సుప్రీం కోర్టు. 1972లో స్టాక్‌హోంలో జరిగిన మానవ పరిసరాల సదస్సు నుంచి, 1995లో ఎఫ్ఎఒ జరిపిన అక్వా కల్చర్ అభివృద్ధికి సంబంధించిన పర్యావరణ అధ్యయనం, నిర్వహణల సదస్సు వరకు పరిశీలించారు న్యాయమూర్తులు. ఈ చివరి సదస్సులో, మద్రాసు లోని కేంద్ర బ్రాకిష్ వాటర్ అక్వాకల్చర్ పరిశోధనా సంస్థ నిపుణుడు డాక్టర్ అళగర స్వామి సమర్పించిన ఒక సాంకేతిక పత్రాన్ని తమ తీర్పుకు నేపథ్యంగా వాడుకున్నారు.

తమ తీర్పులో – ప్రధానంగా పర్యావరణ కాలుష్యం, రొయ్యల పరిశ్రమల వల్ల ఆయా స్థానిక ప్రదేశాలలో పౌరజీవనానికి కల్గుతున్న అంతరాయాలు, వ్యవసాయం వంటి సాంప్రదాయ వ్యాపకాలపై దాని ప్రభావం, దాని ద్వారా దేశానికి లభించే విదేశీ మారక ద్రవ్యం, దారిద్రంకల సమస్యలు, మంచి నీటికి ఇబ్బందులు, మడ చెట్లకు జరిగే ప్రమాదం వంటి వాటిపై తమ దృష్టి కేంద్రీకరించారు న్యాయ మూర్తులు. దీనిపై సవివరమైన వాదోప వాదాలు ఆలకించారు. తీర ప్రాంతానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం చేసిన కోస్టల్ రెగ్యులేషన్ జోన్ చట్టం అతిక్రమణ జరిగిందా అన్న అంశంపై ఆరా తీశారు. రొయ్యల పరిశ్రమకు సముద్రంతో, ఉప్పు నీటితో తీర ప్రాంతంతో కల సంబంధ, బాంధవ్యాలను పరిశీలించారు. వీటన్నింటినీ ఆధారంగా చేసుకొని తమ తీర్పు ప్రకటించారు.

తీర్పు చాలా తీవ్రంగా, కఠినంగా వుంది. సిఆర్‌జెడ్ నిబంధనలను తుచ తప్పకుండా పాటించా లన్నది తీర్పు సారాంశం. 1991 ఫిబ్రవరిలో వచ్చిన తొలి సిఆర్‌జెడ్ నిబంధనల ప్రకారం సముద్రపు పోటు అలతాకే ప్రదేశం నుంచి నేలవైపు 500 మీటర్ల దూరంలో ఎటువంటి కట్టడాలూ నిర్మించ కూడదు; వ్యవసాయం, చేపలు ఎండ బెట్టు కోవడం తప్ప మరే పరిశ్రమ, వ్యాపకం చేపట్ట కూడదు. ఈ 500 మీటర్ల నిబంధన – సముద్ర అలల ప్రభావం కల్గిన కాలువలు, నదులు, బ్యాక్ వాటర్స్, ఏర్లు, వాగులు, సరస్సులు తదితరా లన్నింటికి

కొరవ 7 పేజీలో

ఉచితం
విమల్ జంక్షన్ వారి సంక్రాంతి కానుక
సూటింగ్స్, షర్టింగ్స్, జెంట్స్ రెడిమేడ్స్ పై
వెయ్యి రూపాయలు కొనుగోలు చేయండి
వెండి నాణెము ఉచితంగా పొందండి
అన్ని జెంట్స్ రెడిమేడ్స్ పై
10% ↔ 30%
గొప్ప తగ్గింపు
VIMAL CARD
ఈ డిస్కౌంట్ డిశంబరు 20 నుండి జనవరి 15 తేది వరకు
విమల్ జంక్షన్
కాపువీధి నెల్లూరు - 1.
ఫోన్: 25420

బంగారమంతా వెలికి వస్తే బంగారు భవిష్యత్తు

షేర్‌కాలం

డా. ఎ. దుర్గాప్రసాద్

విదేశాలలోని భారతీయులు స్వదేశం వచ్చేటప్పుడు 10 కిలోల బంగారు తమ వెంట తెచ్చుకో వచ్చునని కేంద్ర ప్రభుత్వం తాజాగా చేసిన నిర్ణయం - ప్రభుత్వానికి రెండు రకాలుగా లాభిస్తుంది. మొదటిది దిగుమతి సుంకం వసూలు పెరగడం; రెండవది బంగారు కొనుగోలుకు విదేశీ మారక ద్రవ్యం వెచ్చించే సమస్య తప్పడం.

ప్రపంచ మంతటిలో భారత దేశంలోనే ప్రజల దగ్గర అత్యధిక పరిమాణంలో బంగారపు నిల్వలున్నాయని అంచనా. అది కొన్ని వేల టన్నుల్లో వుంటుందని అంచనా. దేశంలోని సంపన్నులు తాము వాడకుండా లాకర్లలో, ఇనుప పెట్టెలలో, మార్వాడీ తాకట్టులో పెట్టి వున్న బంగారు నగలన్నింటినీ ప్రభుత్వం దగ్గర డిపాజిట్ చేస్తే - దేశ ఆర్థిక స్వరూపమే మారిపోతుందని నిపుణులు చెప్తుంటారు. అంత విస్తృత స్థాయిలో మన దగ్గర బంగారం నిల్వ లున్నాయి. కుటుంబ పరమైన, మతపరమైన [illegible]క్రమాలలో భారత దేశంలో వలె బంగారు నగలు వినియోగించే సాంప్రదాయం మరే దేశంలోనూ లేదు. ప్రజల పొదుపులో అత్యధిక భాగం బంగారు [illegible]సంలో అనుత్పాదకంగా మిగిలి పోవ[illegible] భారత దేశం విశిష్టత. దిగువ మధ్య తరగతి కుటుంబాల నుంచి, కుబేరుల వరకు మిగులు ధనం కన్పించి నప్పుడల్లా బంగారు నగలు కొనడం సాంప్రదాయంగా వస్తున్న అలవాటు. ఒక్క 1995-96 సంవత్సరంలోనే అధికారికంగా 200 టన్నులకు పైగా బంగారం దేశంలోకి దిగుమతి అయ్యిందంటే - ఈ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. టన్ను బంగారం విలువ సుమారుగా 50 కోట్లు. 200 టన్నుల బంగారు దిగుమతి అంటే - 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడి. ఇంత మొత్తం ప్రజల కుటుంబ అవసరాలకు వినియోగమైంది. ఈ లెక్కన దేశంలో ఎన్ని లక్షల కోట్ల విలువైన బంగారు నిల్వ వుండి వుంటుందో వూహించు కోవచ్చు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం బంగారు దిగుమతిని సులభతరం చేసింది. దుబాయ్‌లోని బంగారు వ్యాపారులకు ఎంతో వుపయోగ కరమైన చట్టం ఇది. దుబాయ్‌లోని బంగారు వ్యాపారులలో 90 శాతం మంది భారత దేశానికి చెందిన మార్వాడీ కుటుంబీకులే! అక్కడి బంగారు నగల మార్కెట్ మన నెల్లూరు చిన్నబజారు మాదిరే వుంటుంది. ప్రతి అంగడిలోనూ రోజుకు కొన్ని కిలోల బంగారు నగలు అమ్ముడౌ తుంటాయి. దుబాయ్ సందర్శించే యాత్రికులు ఈ నగలు కొనుగోలు చేస్తుంటారు. మన దేశంలోకి వచ్చే బంగారులో అత్యధిక భాగం దుబాయ్, సింగపూర్‌ల నుంచే వస్తుంటుంది.

విదేశాలలో వుండే భారతీయులు ఒక్కొక్కరు 10 కిలోల బంగారు తెచ్చుకోవచ్చునే చట్టం చేయడం వల్ల దుబాయ్ బంగారు వ్యాపారులు, వారి ఏజంట్లు గల్ఫ్ దేశాలలోని చిన్న చిన్న వుద్యోగులను సెలవుపై తమ ఖర్చులతో ఇండియాకు పంపి, బంగారును అధికారికంగా స్మగ్లింగ్ చేయిస్తారు. సెలవుపై ఇండియాకు వచ్చిపోయే ఎన్ఆర్ఐలు తమ స్వంత అవసరం కోసం అంతంత బంగారు తెచ్చుకోలేరు. గల్ఫ్‌లో పనిచేసే భారతీయులలో అత్యధికులు చిరుద్యోగులే; వారి వద్ద అంత డబ్బు వుండదు. అందువల్ల వారి ద్వారా ఈ ఏజంట్లు బంగారు వ్యాపారం చేస్తారు. కస్టమ్స్ సుంకం కట్టినప్పటికీ - దుబాయ్ ధరకు, భారతీయ మార్కెట్ ధరకు వుండే తేడా వల్ల కిలోకు రూ.60 వేల వరకు గిట్టుబాటు అవుతుంది. వీరికి 10 కిలోల బంగారు అంటే రూ.50 లక్షలు; ఆ పెట్టుబడిపై ఒకటి రెండు రోజులలోనే ఆరు లక్షల లాభం. అక్కడ తెచ్చి, ఇక్కడ అమ్మడమే కదా!

ఈ చట్టం వల్ల దేశంలో బంగారు ధర గ్రాముకు 20 నుంచి 30 రూపాయల వరకు తగ్గే అవకాశం వుంది.

నేటిభారతం

తిరుమూరు సుధాకర రెడ్డి

సింగిల్ పాయింట్ శేషన్

అవినీతిని అంతం చేసేందుకు దేశ వ్యాప్తంగా ఒక ఏక సూత్ర పోరాటం మొదలు పెడతా మంటు న్నారు మాజీ ఎన్నికల సంఘం ప్రధానాధికారి శ్రీ టి.ఎన్. శేషన్. అయితే ఈ సింగిల్ పాయింట్‌పై సింగిల్‌గా పోరాడాలా లేక ఇంకె వరితోనైనా కలిసా అనే విషయం ఆయన తేల్చుకోలేక పోతున్నారు! మహారాష్ట్ర ప్రభుత్వంపై అవినీతి ధ్వజమెత్తిన అన్నాహజారే శేషన్‌తో చేతులు కలపాలని మహా ఆరాట పడుతున్నారు - వాళ్ళిద్దరూ ఇటీవల కలుసుకోవడం దీనిపై చర్చించు కోవడం జరిగింది. అయినా శేషన్, అన్నాహజారేతో కలిసి పనిచేసే విషయంపై ఇంకా సందిగ్ధంగానే వున్నారు. సంక్రాంతి వరకూ సైలెంట్‌గా వుండమని శేషన్‌ను ఆయన గురువు గారు ఆదేశించారట! రాష్ట్రపతి పదవిపై కన్నేసిన శేషన్‌కు అన్ని పార్టీలూ తలుపులు గట్టిగా మూసేశాయి. ఆయన్ని అందరూ 'టచ్‌మీ నాట్' అంటున్నారు. ఒక్క అన్నా హజారే మాత్రం ఆయనతో కలవాలని వున్నాడు. కానీ కలిసి పనిచెయ్యడం అనేది శేషన్ ఇంటవొంటా లేదుగదా!

రోజుకో పులి - బలి!

మన దేశంలోని బెంగాలీ టైగర్లు రోజుకొకటి లెక్కన వేటగాళ్ళకు బలైపోతున్నాయి - ఈ వేట ఇలాగే కొనసాగితే మన దేశంలో పులులకు చోటే ఉండబోదని పర్యావరణ పరిశోధకులు ఆందోళన చెందుతున్నారు. మొత్తం ప్రపంచం మీద 6వేల పులులు వుంటే అందులో మూడింట రెండు వంతులు ఇండియాలోనే వున్నాయట! కానీ వాటిని కాపాడటంలో మనం ఘోరంగా విఫల మౌతున్నాము. పులుల ఎముకల పొడితో ఔషధాలు చేసే ఫ్యాక్టరీలు చైనా, జపాన్, దక్షిణకొరియా దేశాలలో చాలా వున్నాయి! ఆ ఫ్యాక్టరీలన్నిటికీ 'ముడిసరకు' మన దేశం నుంచే సరఫరా అవుతోందట! పులి చర్మాలు, ఎముకల వ్యాపారం అంతర్జాతీయంగా నిషేధించ బడింది. అయినా దొంగ చాటుగా వీటి వ్యాపారం భారీఎత్తున లాభసాటిగా సాగుతూంది. పులుల పరిరక్షణ కోసం 1973లో ప్రారంభించబడిన ప్రాజెక్టు టైగర్ పథకం ప్రస్తుతం నత్తనడకన నడుస్తున్నది!

పేదరికంలో ఫస్ట్

గ్రామీణ పేదరికంలో మన దేశంలోకి ఒరిస్సా రాష్ట్రం మొదటి స్థానంలో వుంది. అక్కడ 42.89 శాతం గ్రామీణులు దారిద్ర్యరేఖ దిగువన జీవిస్తున్నారని 43వ జాతీయ శాంపిల్ సర్వేలో వెల్లడయింది. గ్రామీణ పేదరికం విషయంలో మధ్యప్రదేశ్ ద్వితీయ స్థానంలోనూ, బీహార్ తృతీయ స్థానంలోనూ వున్నాయి. గ్రామీణ పేదల శాతం అతి తక్కువగా ఉన్న రాష్ట్రం పంజాబ్. అక్కడ 4.99 శాతం మాత్రమే గ్రామీణ పేదలున్నారట!

శివసైనికుల ఆగడాలు

బొంబాయిలో శివసేన కార్యకర్తలు రానురాను యమకింకరులుగా తయారవు తున్నారు. వారి నాయకుడు బాల్‌థాకరేని ఒక ఉపన్యాసంలో విమర్శించి నందుకు మాజీ డిప్యూటీ మునిసిపల్ కమీషనర్ జి.ఆర్. ఖైర్నార్ ఇంటిని ముట్టడించి శివసైనికులు నానా బీభత్సం సృష్టించారు. ఖైర్నార్ ఉపన్యాసాన్ని ప్రచురించి నందుకు 'మహానగర్' అనే పత్రికా కార్యాలయాన్ని ధ్వంసం చేసి సిబ్బందిని, సంపాదకుడిని గాయపరిచారు.

పోలీసులు 18మంది కార్పొరేటర్లపై కేసులు పెట్టారు. ఈ దారులకు సుధీర్‌గంభీర్ అనే శివసేన పార్టీ ఎమ్మెల్యే నాయకత్వం వహించాడట! మొత్తానికి బొంబాయి పౌరులకు ఫాసిజమంటే ఏమిటో రుచి చూపిస్తున్నది 'శివసేన'.

జ్ఞాప'శక్తి'కి బ్రాహ్మి గుళికలు!

వెల్వెట్ ఇంటర్నేషనల్ ఫార్మా ప్రొడక్ట్స్ కంపెనీ జ్ఞాపక శక్తిని పెంచేదానికి ఓ దివ్యౌషధం తయారు చేసింది. 'మెమరీప్లస్' అని ఈ గుళికలకు పేరు పెట్టారు. లక్నోలోని సెంట్రల్ డ్రగ్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ వారి ఫార్ములా ఆధారంగా ఇవి తయారైనాయి. ఈ మాత్రలకు ముడిసరకు అధర్వణ వేదంలో ప్రస్తావించ బడిన 'బ్రహ్మి' మొక్క! పూర్వకాలంలో దీన్నొక ఆకుకూరగా భోజనంలో ఉపయోగించే వారట! గత ఏడాది అప్పటి ప్రధాన మంత్రి శ్రీ పి.వి. నరసింహారావు గారిచే ఇవి విడుదల

కొత్త సంవత్సరంలో షేర్లకు కొత్త వూపిరి!

షేర్ మార్కెట్‌కు 1997 సంవత్సరం చాలా శుభప్రదంగా వుండే సూచనలు కన్పిస్తున్నాయి. పైపై తళుకులు, ఉత్తుత్తి భ్రమలు కాకుండా నిజమైన అభివృద్ధి, ఆరోగ్యకర వాతావరణం ఏర్పడు తాయన్న ఆశ కల్గిస్తున్నది కొత్త సంవత్సరం

ఈ సూచన కొత్త సంవత్సరం తొలిరోజే స్పష్టంగా కన్పించడం సంతోష దాయకం. జనవరి 1 తేది ఒక్కసారిగా ఎ-గ్రూప్ షేర్లతో పాటు బి-గ్రూప్ షేర్ ధరలలోనూ కదలిక వచ్చింది. చిన్న, పెద్ద కంపెనీల షేర్లు కొనడానికి దేశమంతా లక్షల సంఖ్యలో క్యూ కట్టారు. బి-గ్రూప్ షేర్లను కొనేవారు తప్ప, అమ్మేవాళ్లు లేకపోవడంతో ధరలు 10 శాతం వరకు పెరిగాయి. సెన్సెక్స్ ఇండెక్స్ ఒకేరోజు 175 పాయింట్లు పైకి ఎగబ్రాకింది.

ఎస్సా సుగర్స్ షేర్ ధర రూ.3ల నుంచి రూ.4.50 లకు పెరిగింది. రిలయన్స్ క్యాపిటల్, వివిఎస్ ఫైనాన్స్ ధరలు బాగా పెరిగాయి. సిమెంట్స్, టెలికాం రంగాలకు సంబంధించిన కంపెనీల లోనూ మంచి మార్పు వచ్చింది. ఈ ధోరణి ననుసరించి ఎ-గ్రూప్ లోని స్టేట్ బ్యాంక్, టిస్కో, ఎల్‌అండ్‌టి, రిలయన్స్‌ల షేర్లు రూ.10ల వరకు హెచ్చాయి.

జనవరి 2 తేది ట్రేడింగ్‌లో పెద్ద కంపెనీల షేర్ ధరలు రూ.5ల వరకు తగ్గినా - బి-గ్రూప్ ధరలు తగ్గలేదు. నేషనల్ స్టాక్ ఎక్ఛేంజిలో వెయ్యి కోట్ల వ్యాపారం, బొంబాయి ఎక్ఛేంజిలో 560 కోట్ల టర్నోవర్ జరిగాయి. ఇదొక శుభ పరిణామం.

ఖర్చుపన్ను

ఆదాయం పన్నుకు అదనంగా ఖర్చు పన్ను విధించ డానికి కేంద్రం సన్నాహాలు చేస్తూంది. 9 ప్రణాళికలోనే దీన్ని అమలు చేయాలన్నది ఆలోచన. ఇందు కోసం ఒక ప్రతిపాదన పత్రాన్ని రూపొందించి నేషనల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ చర్చకు సిద్ధం చేశారు.

ప్రజలు పెట్టే ప్రధాన ఖర్చులన్నీ ఈ పన్ను పరిధిలోకి వస్తాయి. ఇళ్లు, ఆస్తులు కొన్నవారు;

10కిలోల దిగుమతికి అనుమతి దళారులకే వుపయోగం!

కార్లు, ఇతర ఖరీదైన వాహనాలు కొనుగోలు చేసేవారు, టెలిఫోన్‌ను అధికంగా వాడేవారు ఈ పన్ను కట్టవలసి వుంటుంది. ఎయిర్ కండిషనర్ వంటి విలాస వస్తువుల వినియోగంపై - కరెంట్ బిల్లుల ఆధారంగా పన్ను విధిస్తారు.

9 ప్రణాళికలో పన్ను రేటు, పన్నుల ప్రాతిపదిక (బేస్) కూడా పెంచాలని, సబ్సిడీలు, అనుత్పాదక వ్యయం తగ్గించాలని నిర్ణయించారు. ఆర్థికాభివృద్ధికి ఇది అవసర మన్నది అభిప్రాయం. చిదంబరం పరిశ్రమలపై మోపిన మినిమం ఆల్టర్‌నేటివ్ ట్యాక్స్ భారం ఎంతో సమంజస మైనదని ప్రణాళికా సంఘం భావించింది.

బిర్లాలస్థానం కదిలిపోయింది!

సంపదలో, వ్యాపార టర్నోవర్‌లలో, లాభాలలో, పరిశ్రమల వృద్ధిలో ఎప్పుడూ మొదటి రెండు స్థానాలలో వుండే బిర్లాలు ఈ ఏడాది చాలా క్రిందకు వచ్చేశారు. ఒకే కుటుంబంగా కాక, విడివిడిగా పరిశ్రమలు నిర్వహించడం దీనికి ఒక కారణం. బిర్లా కుటుంబంలోని యువతరం - సమైక్యంగా కాక ఒక్కొక్కరు ఒక్కొక్క గ్రూప్‌ను నిర్వహిస్తున్నారు. పైపెచ్చు ఈ విడివిడి గ్రూప్‌ల నిర్వహణ సైతం సంతృప్తికరంగా లేదు. గ్రాసిం కంపెనీ మార్కెట్ విలువ 22 శాతం పడిపోయింది. ఇండో గల్ఫ్ ఫెర్టిలైజర్స్ మార్కెట్ విలువ 30 శాతం పతనమైంది. మంగుళూరు ఫర్టిలైజర్స్ విషయంలో ఈ పతనం విలువ - 32 శాతం. ఒక్క ఇండియన్ రేయాన్ మాత్రం 10 శాతం లాభం చూపించింది.

వ్యాపార విస్తరణ మోజులో తమకు సంబంధంలేని రంగాలు, పరిశ్రమలలో వేలుపెట్టడమే వీరి స్థానం తరుగుదలకు కారణం. టాటా గ్రూపు కంపెనీలు మాత్రం ఈ ఏడాది ఉజ్వలంగా వున్నాయి. వారి టర్నోవర్, లాభ శాతం, సంపద విలువ ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. మొదటి పది పారిశ్రామిక సంస్థలలో మొదటిదిగా వుంత గల్గడమే కాదు - తమకు ఇతర గ్రూపు సంస్థలకు మధ్య ఎంతో వ్యత్యాసం వుండేంతగా టాటాలు అభివృద్ధి సాధించారు.

న్యూస్‌మేకర్ ఆఫ్ ది ఇయర్!

కాలచక్రం గిర్రున ఒక చుట్టు తిరిగింది; కలిగి యుగపు క్యాలెండర్‌లో ఒక కాగితం చిరిగి పోయింది! పాత సంవత్సరం పోవడం, కొత్త సంవత్సరం రావడం – రాత్రి గడిచి పగలు; పగలు ముగిసి రాత్రి వచ్చినంత సహజం. సూర్యుడి దాగుడు మూతల వలె సంవత్సరాల రాకపోకలు ఎవరి చేతిలోనూ లేవు. సృష్టి ప్రారంభమైన తర్వాత ఎన్ని లక్షల కోట్ల సంవత్సరాలు గడిచి పోయాయో ఎవరికీ తెలియదు. సృష్టి క్రమంలో సంవత్సరం అనేది సముద్రంలో ఒకే ఒక నీటి బొట్టు. మానవుడు అల్పాయుష్కుడు, అందులోనూ అర్థాయుష్కుడూ కాబట్టి 365 రోజుల కాలమానం ఎంతో సుదీర్ఘంగా కన్పిస్తుంది కాని – ఈ నేల, ఈ నేరు, ఈ గాలితో నిండిన ప్రకృతి మాతకు ఇదొక క్షణంలో వెయ్యోవ వంతు మాత్రమే; ఇంకా చెప్పాలంటే లక్షవ వంతు. ప్రపంచ మనుగడకు ఏడాదుల కొలత అనవసరం – అది నిరంతరాయ చక్ర భ్రమణంలో ఒక గిరికి మాత్రమే; కానీ మానవ జీవనంలో దానికి చాలా ప్రాధాన్యం; అందులోనూ 1996 సంవత్సరం భారతీయులకు మరీ ముఖ్యమైన మైలు రాయి.

ప్రజా జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేసింది - 1996? ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ నెంత సంక్షుభితం చేసింది ఈ పాడు సంవత్సరం? మనందరికీ ఇది కుంభకోణాల సంవత్సరం. అంతకు ముందు ఏడాది పూర్వార్థం జైన హవాలా గునపంతో రాజకీయ అవినీతి సమాధుల త్రవ్వకం ప్రారంభమైనా ఈ ఏడాదిలోనే రాజకీయ వాదుల అవినీతి ఎముకల గుట్టలు, పుర్రెల హారాలు కొల్లలుగా, కోకొల్లలుగా బయట పడినాయి. పార్టీ పెద్దలుగా, ప్రభుత్వాధి నేతలుగా, పాలకులుగా, ప్రజాస్వామ్య రక్షకులుగా పైపై స్థానాలలో వున్న పెద్ద మనుషుల లేకి బుద్ధులను, పాకీ పనులను, నీతిమాలిన తత్వాలను, నీచ కృత్యాలను నగ్నంగా, విశదంగా, వికృతంగా; బయట పెట్టింది 1996.

133 కోట్ల యూరియా సొమ్మును సాక్షాత్తు ప్రధాన మంత్రి పేరుతో చక్కెర బస్తాపై చీమల దండు లాగా పడి ఆరగిం చేసిన పివి కుటుంబీకుల ధనదాహం యావత్ జాతిని నిశ్చేష్టుల్ని చేసింది ఈ సంవత్సరంలోనే; ఇంట్లో 3 కోట్ల కరెన్సీ కట్టలు పెట్టి మర్చిపోయేంతగా ధన పిశాచాన్ని ఆవహింప జేసుకున్న సుఖరాం కక్కుర్తి చేష్టలతో యావత్ ప్రజానీకం నివ్వెర పోయేట్లు చేసింది ఈ వత్సరమే; మధ్య యుగాల నాటి ఫ్యూడల్ రాణులను స్ఫురణకు తెచ్చే రీతిలో కిలోల కొద్దీ బంగారు, సంచుల కొద్దీ వజ్రాలు, టన్నుల్లో వెండీ తన స్వంతం చేసుకొని, ఇల్లు, వళ్ళు పసిడి మయంగా అలంకరించు కొని ఆనందించిన జయలలిత వికృత విలాసాలను లోకానికి వెల్లడి చేసిందీ ఈ వర్షమే; అవతార పురుషుడి వేషంతో, బడా బడా నేతల ప్రాపకంతో, అతీత శక్తుల మోసంతో హంస తూలికా తల్ప సుఖం అనుభవించి పాపం పండగానే కృష్ణ జన్మస్థాన ప్రారబ్ధమను భవిస్తున్న చంద్ర స్వామి లీలా వినోదాలను ప్రజల కెరుక పరచి ఔరా అన్పింప జేసిందీ ఈ ఏడాదే; పశువుల నోటి దగ్గర గడ్డిని పెరుక్కొని, తమ కంపు నోళ్లలో కుక్కుకున్న లల్లూప్రసాద్ యాదవ్ వంటి రాజకీయ గూండాలను ఏమీ చేయలేని నిస్సహాయతతో నిష్క్రమించింది ఈ సంవత్సరమే!

పెట్రోలు పంపుల సతీష్ శర్మలు, ఇళ్ల గోల్మాల్‌ల షీలా కౌల్‌లు, కాంతి సింగ్‌లు, భజన్ లాల్‌లు, జెఎంఎం ధావన్‌లు, సెంట్‌కిట్స్ పివి నరసింహా రావులు... ఇట్లా ఎందరినో, ఎంద రెందరినో వారి వారి నిజ స్వరూపాల్లో ప్రజల కళ్ల ఎదుట నిలిపి వెళ్లింది 1996. భారత రాజకీయ వ్యవస్థలో అవినీతి ఆది నుంచీ అంతర్భాగ మైనప్పటికీ అదింత విశృంఖలంగా, విచ్చలవిడిగా, పలుపుతాడు తెంచుకున్న ఆంబోతు వలె పెరిగి పోయిందని, సంచరిస్తున్నదని, రంకెలు పెడుతున్నదనీ రుజువు చేసిన ఏడాది ఇదే! మన పాలకులు ఇంతటి నీచులనే ఏహ్యాభావం కలిగించి మన మందరం ప్రపంచ వాకిలి ముందు సిగ్గుపడాల్సిన పరిస్థితి కల్పించిందనే బాధతో 1996ను నిందించడం తప్పు; ఈ నీచులు ప్రజాస్వామ్య వ్యవస్థ మూలుగులను మరింత పీల్చి పారేసి, ఎముకలు కూడా కుళ్లి పోయే పరిస్థితి ఏర్పడక ముందే – ఆ చీడ పురుగులను ఏరి పారేసి మేలు చేసినందుకు అభినందించడం సమంజసం.

తుఫాన్ బీభత్సంతో పచ్చటి కోనసీమలను శ్మశాన సదృశంగా మార్చింది; కరువు కోరలలో ఒరిస్సా నిరుపేదలను నలిపి పారేసి, ఆకలి చావులకు ఎర చేసింది కూడా ఈ సంవత్సరమే. తమ వ్యక్తిగత ప్రజాభి మానంతో, రాజకీయ సమ్మోహనా శక్తితో ప్రధాన మంత్రిత్వాన్ని నిర్వహించే నెహ్రూ కుటుంబీకులను కాలగర్భంలో కలిపి, పదమూడు పార్టీల అండతో, కుంటి ప్రభుత్వాన్ని నడిపే రాజకీయ మరుగుజ్జు, దేవగౌడను దేశాధినేతగా నిలబెట్టి పోయిందీ ఇదే! ఎన్టీఆర్ వంటి ప్రజానేతను; నీలం సంజీవ రెడ్డి, మర్రి చెన్నారెడ్డి వంటి రాజకీయ దురంధరులను మట్టిలో కలిపేసిందీ ఇదే సంవత్సరం.

ఏ రూపంలో చూసినా 1996 సంవత్సరానికి ఆధునిక భారతీయ చరిత్రలో అతి ముఖ్య స్థానం లభిస్తుంది. కొత్త 1997 - వచ్చు కాలం కంటె గతించిన కాలం మేలు అన్పిస్తుందో, లేక మంచిని హసింప జేస్తుందో చూడాలి.

జమీన్‌రైతు

3.1.97

పేజీలు:8 వెల:0-1-6

రావుసాహెబ్ రావు బహదూర్లకు స్వస్తి

బిరుదు ప్రదానం విషయంలో కాంగ్రెసు ముస్లింలీగ్ అభిప్రాయాల ననుసరించి, యేవో ప్రత్యేక సందర్భాలలో తప్ప బ్రిటిష్ ఇండియాలో భారతీయుల కెవరికీ బిరుదుల నీయరని క్యాబినెట్‌లో నిర్ణయించ బడింది. సాహస కృత్యాలు చేసిన భారతీయ సైనికులకు, సముచిత కార్యాల్లో సాహసాన్ని చూపిన పౌరులకు బిరుదులు ఇవ్వబడుతవి. పోలీసు ఫైర్ సర్వీసులకు యిది వరలో వలెనే జార్జిరాజా, పోలీసు పతకం, కెయిజర్ - హింద్ పతాకాల బహూకరణ ఉంటుంది.

బెజవాడలో ఆంధ్రా రేడియో

ఆంధ్రులకు ఒక ప్రత్యేక రేడియో స్టేషన్ కావాలని జరుగుతున్న చిరకాలపు ఆందోళన సత్వరం సఫలమయ్యే సుదినం ఆసన్నమైనట్లుంది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం విషయమై 'పట్టాభి - పటేల్' కుస్తీ పట్టి అనంతరం, ఆంధ్రుల ప్రేమను చూరగొనాలని పటేల్ ఉవ్విళ్లూరు తున్నారు. ఆను ఇన్‌ఫర్మేషన్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ శాఖలకు గూడ అధిపతిగదా. ఆంధ్రా రేడియో స్టేషన్ ఫైలు అతి జాగ్రత్తగా చదువు తున్నాడని రహస్య భేది అన్నాడు.

ఏదెట్లా ఉన్నా వచ్చే కేంద్ర శాసన సభ బడ్జెటు సమావేశంలో పటేల్ శాఖ డిమాండ్ సందర్భమున ఆచార్య రంగాగారు యీ విషయమై ఆందోళన లేవదీస్తారని గూడ అనుకొంటున్నారు. ఫిబ్రవరి వస్తున్నది కదా - కొంచెం ఓపిక పట్టండి.

పాకిస్థాన్ ప్రవక్త పుట్టినరోజు

పాకిస్థాన్ ప్రవక్త ఖాయిదే అజాంజనాబ్ మహమ్మదాలి జిన్నా సాహెబ్ పుట్టిన రోజు, క్రిస్టమస్ పెద్ద పండుగ ఒకేరోజు రావటం గమనార్హము. బ్రిటిష్ ప్రభుత్వ కిరస్తానీలు, మన ముసిలిం పాకిస్థానీల మనసులు - భారత స్వరాజ్యోద్యమ ప్రతిఘటన విషయంలో కలిసినట్లే ఈ పండుగలూ కలిసాయి. గుంటూరు సలాంగారు ఈ పండుగ కానుకగా పాకిస్థాన్ పత్రిక ఇచ్చారట జిన్నాకి. గుంటూరు మహమ్మదీయులు "నేతాజీ జిన్నా" అంటున్నారిపుడు. 'పేరులో యెక్కిన బోస్ తత్వమే మనసులోకి ఎక్కితే వారూ దేశము కూడా బాగుపడుతవి.

50 ఏళ్ళ క్రితం ఈ వారం

నెల్లూరు ముచ్చట్లు

కొరవ 11 పేజీలో

పూటకొక్క కార్యక్రమం ప్రజల కోసమనడం నేరం!

పరిపాలనా యంత్రాంగాన్ని పూర్తిగా గాడి తప్పిస్తున్నది తెలుగు దేశం ప్రభుత్వం. చంద్ర బాబు అధికారం లోకి రాగానే ప్రజల వద్దకు పాలన అన్నారు. దాని ఫలితాలు దేముడెరుక; దాన్ని వదిలిశ్రమదానంపై పడ్డారు; తరువాత తుఫాన్ సహాయక చర్యలు; వాటి నుంచి అధికారులు తేరుకునే లోగానే జన్మభూమి కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. ఒక పద్ధతంటూ ఒకదాని వెంట మరొకటిగా కార్యక్రమాలు ప్రారంభిస్తే, అవి ఏ విధంగా విజయవంత మవుతాయి? చంద్రబాబు ప్రయోగాల వల్ల అధికారులు ఆఫీసుల్లో పని మాని, పనికి మాలిన ఫైళ్లతో కాలం వెళ్లదీయాల్సి వస్తున్నది.

నెల్లూరు టి.వి.నారాయణ

సోమిరెడ్డి పేరు నిలబెట్టుకోవాలి

సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డికి మంత్రి పదవి వచ్చినందుకు సంతోషపడని సర్వేపల్లి వాసులుండరు. శాఖ ఏదైనా కావచ్చు; పరిమళించే పుష్పం ఎక్కడున్నా వాసన విరజిమ్ము తుంది. అదే విధంగా సోమిరెడ్డి తన పదవిలో రాణించి జిల్లాకు మంచిపేరు తేవాలి. రైతుల పట్ల అభిమానాన్ని ప్రదర్శించాలి; సోమశిల జలాశయానికి పూర్తి సామర్థ్యంతో పాటు, కృష్ణపట్నం థర్మల్ స్టేషన్, పోర్టు నిర్మాణం త్వరగా ప్రారంభ మయ్యేటట్లు చూడాలి.

గుడ్లూరువారిపాళెం ఈ. వెంకురెడ్డి

ప్రభుత్వంలో చిత్తశుద్ధి లేదు

డిసెంబరు 20తేది సంచికలో 'నయవంచన' హెడ్డింగ్‌తో వ్రాసిన

జనవాణి

సంపాదకీయం సమగ్ర సుందరంగా ఉంది. మద్యపాన సమస్య దీర్ఘకాలిక రోగం వంటిది. ఇది సంఘ శరీరాన్ని కృంగ దీసేదిగా ఉన్నందున, పరిష్కారం దీర్ఘ కాలిక చికిత్స వలె ఉండాలి. ఖాళీ ఖజానాను • కక్కుర్తిగా చూపించి తప్పించు కోవడం భావ్యం కాదు. మద్య నిషేధం వల్ల చాలా కుటుంబాలు హాయిగా జీవనం సాగిస్తున్నాయి. మద్య నిషేధ కమీషనర్ జన్నత్‌హుస్సేన్ కలెక్టర్ల సమావేశంలో తమ శాఖ వైఫల్యాన్ని వివరించడం, ఆయనలోని నిజాయితీని చాటింది. కలెక్టర్లు, ఎక్సైజ్ అధికార్లు చిత్త శుద్ధితో పనిచేస్తే నిషేధం అమలు చేయడం ప్రభుత్వానికి పెద్ద పనికాదు. గతంలో మద్య నిషేధం బూచి చూపి సబ్సిడీ బియ్యం, విద్యుత్ ఛార్జీలతోపాటు పలు పన్నులు పెంచారు. మళ్లీ ఆర్థిక పరిస్థితి సాకుగా చూపి సారాను అనుమతిస్తే ప్రజలు క్షమించరు.

నెల్లూరు శారదాకుమార్

అవినీతిపై ఉద్యమం అభినందనీయం!

అవినీతితో దేశం కుళ్లి పోతూందని రాజకీయ నాయకులు చెబు తుంటారు. కానిఅవినీతికి వారే మూలకారకులు. అవినీతిపై రణభేరి మ్రోగించిన సిపిఎం అనుబంధ యువజన సమాఖ్య డి.వై.ఎఫ్.ఐకి అభినందనలు. లంచం ఇవ్వడం - తీసుకోవడం తప్పని వీరు ఈ మధ్య ఒక ఉద్యమం మొదలెట్టారు. వీరంతా ఆఫీసర్లపైనే తమ దృష్టి నిలపక స్వపార్టీతో సహా, అన్ని రాజకీయ పార్టీల నాయకులపైనా కన్నేసి ఉంచాలని మనవి.

నెల్లూరు వాస్తు రామచంద్ర

సీతారాం కేసరి బెటర్

ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీకి సీతారాం కేసరి నాయకత్వం ఎంతో అవసరం. పివి నరసింహారావు హయాంలో పార్టీ గబ్బు పట్టి పోయింది. పార్టీ నుంచి వెలుపలికి వెళ్లిన నాయకు

కొరవ 10 పేజీలో

నేను సభపెడితే జనమే రారెందువల్ల?

'ఆడలేక మద్దెల వోడన్న' సామెతనుడిసిసి అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి గుర్తుకు తెచ్చారు. 28వ తెది పార్టీ 112వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా చేస్తానని ముందురోజు ప్రకటించా రాయన. కానీఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన ఆసభ జనం లేక వెలవెల బోయింది. దీంతో సంజీవరెడ్డికి చిర్రెత్తి నట్లుంది. వచ్చిన కొద్దిమంది కార్యకర్తలపై విరుచక పడ్డారు. యువ నాయకులు పదవులు కావాలని పదేపదే నావెంటబడి విసుగెత్తిస్తారు; కాని కార్యక్రమాలకు రారు; అందువల్లే శతాబ్దం చరిత్ర కల్గిన

ఆనం సంజీవరెడ్డి ఆక్రోశం

కాంగ్రెస్ జవసత్వాలు కోల్పోయింది. జనార్దనరెడ్డి వస్తే మాత్రం ఇందిరా భవన్ నిండిపోతుంది. ఆయన రానప్పుడు ఎందు కింత బోలుగా వుంటున్నదని కార్యకర్తలనే ప్రశ్నించే సరికి వచ్చిన వాళ్లు సైతం లేచి వెళ్లిపోనా రంభించారు. పార్టీ సభ్యత్వ పుస్తకాలను పార్టీ నాయకులు ఇప్పటి వరకు తీసుకెళ్లలేదని, సభ్యత్వ గడువు కూడా అయి పోతున్నదని సభలోనే వున్న బిసి నాయకులపై కోప్పడ్డారాయన. పార్టీ నాయకులు వర్గాలు వీడాలని సలహా యిచ్చా రాయన. సంజీవరెడ్డి ఉపన్యాసం దెబ్బకు దిమ్మ తిరిగిందేమో ప్రక్కనే ఉండిన సివి శేషారెడ్డి, కె.వి. సుబ్బారెడ్డి తరువాత మాట్లాడలేక పోయారు.

అదే రోజు ఉదయం ఇందిరాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ పతాకాన్ని సంజీవరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆనం వివేకానంద రెడ్డి, సివి శేషారెడ్డి, దేవకుమార్ రెడ్డి, సునీల్ కుమార్‌రెడ్డి, పందిల్లపల్లి అరుణమ్మ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 50లక్షలు!

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లో ఆపరేషన్ సామగ్రి సిద్ధం చేసేందుకు ప్రభుత్వం 50 లక్షలు మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సాంబశివరావు చెప్పారు. జిడ్పీ మీటింగ్ హాలులో 28వ తేది వైద్య శాఖాధికారులు, సిబ్బందితో సమావేశమై మాట్లాడా రాయన. గ్రామస్తులకు వైద్య సేవలు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం శస్త్ర చికిత్సకు అవసరమైన పరికరాలు కొని పెడుతుంది. వీటిని డాక్టర్లు సక్రమమైన రీతిలో వినియోగించు కోవాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమంతోపాటు జన్మభూమి కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి. సత్యనారాయణ, అదనపు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పురవీధుల సర్వేలో వెరైటీగా రోడ్‌రోలర్ నడుపుతున్న మునిసిపల్ ఛైర్మన్ ఆనం వివేకానంద రెడ్డి

జన్మభూమిలో జిల్లా ఫస్ట్ రావాలి!

ప్రజల వద్దకు పాలన, శ్రమదానం కార్యక్రమాల విషయంలో నెల్లూరు జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందని; అదే విధంగా జన్మభూమి కార్యక్రమాన్ని నడపాలని ఐదు శాఖల మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కోరారు. జన్మభూమి కార్యక్రమం అమలుపై సైక్లోన్ మీటింగ్ హాలులో జిల్లా అధికారులతో మంత్రి సమావేశ మయ్యారు. రోజుకో నియోజకవర్గంలో పర్యటించి జన్మభూమి కార్యక్రమంలో పాల్గొంటానని, రాత్రి పూట విద్యార్థులతో కలసి గ్రామ సభల్లో పాలుపంచు కొంటానని మంత్రి చెప్పారు. 'నూతన గ్రామ నిర్మాణోద్యమం - కొరియా అనుభవం' పుస్తకాన్ని మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులతో పాటు సాంకేతిక విద్యా మంత్రి పరసా రత్నం, ఎమ్మెల్యేలు ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, కొమ్మి లక్ష్మయ్య నాయుడు పాల్గొన్నారు.

వివేకా పర్యటన

పట్టణంలో పలుచోట్ల నిర్మిత మవుతున్న రోడ్లు, పారిశుధ్య కార్యక్రమాలు జరుగుతున్న తీరును పరిశీలిస్తూ గత నెల రోజులుగా మునిసిపల్ ఛైర్మన్ ఆనం వివేకానందరెడ్డి టౌన్‌లో వీధి వీధి తిరుగు తున్నారు.

కలెక్టర్ కోరిక

29తెది బాలాజీనగర్ సిపిఎం పార్టీ కార్యాలయం చుట్టు పక్కల పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ఆఫీసు చుట్టు పక్కల గుడిసెలు వేసుకొని ఉంటున్న ప్రజలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తానని వాగ్దానం చేశారు. వాసవి నగర్‌లో 50వేల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు పనులు తనిఖీ చేసి, స్వామిదాసు స్కూలు వద్ద డ్రైనేజి ఏర్పాటుకు చర్యలు తీసుకోమని అధికారులను ఆదేశించారు. శెట్టిగుంటరోడ్డును, మార్కెట్‌ను, కపాడిపాళెంలోని రోడ్డు పనులను ఛైర్మన్ పరిశీలించారు.

ఇన్‌ఛార్జి కమీషనర్ ఎం. రామసుబ్బారెడ్డి, హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస రావు, కౌన్సిలర్లు పున్నం బసవయ్య, ఉషారాణి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోమియోలపై జాలిచూపిన మేజిస్ట్రేట్

నెల్లూరు టౌన్‌లోని పలు బస్ స్టాండ్లు, సినిమా హాళ్లు, కాలేజిల వద్ద ఈవ్ టీజింగ్ శృతి మించు తూంది. దీనివల్ల గృహిణులు, విద్యార్థినులు పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లా ఎస్పీ ఈవ్ టీజింగ్ అరికట్టాలని అప్పుడప్పుడు మెరుపు దాడులు నిర్వహింప జేస్తున్నారు. ఇటువంటి దాడి జరిపి 20 తేది విఆర్‌సి సెంటర్ వద్ద టీజ్ చేస్తున్న 5 మంది యువకులను మఫ్టీ పోలీసులు పట్టుకొన్నారు. వీరిని నాలుగో అదనపు మేజిస్ట్రేట్ ప్రేమరాజేశ్వరి ముందు హాజరు పెట్టారు. ఎందువల్లో మేజిస్ట్రేట్ విద్యార్థులపై జాలి చూపారు. తప్పు చేసినట్లు ఒప్పుకోవడం, మొదట తప్పు కావడంతో తలా 50 రూపాయలు జరిమానా విధించారు. ఇటువంటివి మరెప్పుడైనా చేస్తే క్షమించేది లేదని మందలించి వదిలారు. సినిమా హాళ్లు, బస్ షెల్టర్ల వద్ద రెగ్యులర్‌గా ఒకరిద్దరు మహిళా పోలీసులను నియమించి, గమనించ గల్గితే రోమియోలను దారికి తీసుక రావచ్చు.

ర్యాంకులు పొందిన గ్రామాధికార్లు!

డిసెంబర్ నెలలో నిర్వహించిన గ్రామ పరిపాల నాధికార్ల ప్రత్యేక పరీక్షలకు 509మంది హాజరుకాగా 503 మంది ఉత్తీర్ణు లయ్యారట. గ్రామ కరణం పరీక్షల్లో జలదంకి మండలం సోమవరప్పాడు వి.ఎ.ఓ. సి.రాజశేఖర్ రెడ్డి 92.5 శాతం మార్కులతో ఫస్ట్

కొరవ 12 పేజీలో

ప్రకృతితో అవసరాలు తీరాలే తప్ప ఆశలు తీర్చుకోకూడదు!

మల్లంపల్లి సోమశేఖర శర్మ చరిత్ర అధ్యయన కేంద్రం నెల్లూరు పార్థా జూనియర్ కళాశాలలో 'పర్యావరణం - జలధారాలు' అనే అంశంపై ఒక సదస్సు నిర్వహించింది. ప్రముఖ రసాయన శాస్త్రవేత్త డాక్టర్ జి. రాజారెడ్డి సదస్సుకు అధ్యక్షత వహించారు. సదస్సు నిర్వాహకుడు, సర్వోదయ కళాశాల చరిత్ర శాఖాధ్యక్షులు డాక్టర్ జి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రకృతి

నెల్లూరు సంగతులు

పర్యావరణాల సమతౌల్యం లేనందు వల్లే అనేక సమస్యలు ఏర్పడు తున్నాయి; 'ప్రకృతి ఉన్నది మానవుడికి కావలసిన అవసరాలు తీర్చడానికే గాని ఆశలను నెరవేర్చడానికి కాదని' గాంధీజీ చెప్పిన విషయాన్ని గుర్తుకు తెచ్చారు. పర్యావరణాన్ని ఎల్‌కెజి నుండి పిజి వరకు ఒక శాస్త్రంగా బోధించాలని, అందుకు కావలసిన పాఠ్యాంశాలు రూపొందించాలన్నారు. ప్రముఖ ఇంజనీరు అమరా సుబ్బారావు మాట్లాడుతూ టౌన్‌లో రక్షిత మంచినీటిని సరిగ్గా సరఫరా చేయడం లేదని, మురికినీరు పోయేందుకు తగిన వసతులు లేకపోవడం వల్ల ప్రజలు అనారోగ్యం పాలవు తున్నారని చెప్పారు. రిటైర్డ్ జడ్జి కె.పి. నారాయణరావు మాట్లాడుతూ టౌన్‌లో దుమ్ము - ధూళి ఎక్కువై పోయాయని, శబ్దకాలుష్యం పెచ్చు పెరిగి పోయిందని వివరించారు. డాక్టర్ జి.రాజారెడ్డి నీటిని నిల్వ చేసి ఉపయోగించుకొనే పద్ధతులు తెలియ జేశారు. డాక్టర్ ఇ.ఎన్.ఎం. ప్రసాద్, ఎ. సత్యనారాయణ శర్మ సదస్సులో పాల్గొన్నారు.

భారీవర్షాల వల్ల నష్టాలు 27 కోట్లు!

ఈ నెల మొదటి వారం నుంచి జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లు, చెరువులు మరమ్మత్తులు చేసేందుకు 27 కోట్లు అవసర మవుతాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ సాంబశివ రావు చెప్పారు 792 కిలోమీటర్ల రోడ్లు దెబ్బ తినిందని, దీని తాత్కాలిక మరమ్మత్తుకు 5.46 కోట్లు అవసరమని, శాశ్వత మరమ్మతులకు 21.96 కోట్లు కావాలన్నారు. నీటి పారుదల శాఖకు చెందిన 222 చెరువుల తాత్కాలిక మరమ్మత్తులకు 3.04 కోట్లు అవసరమని, పంచాయితీ రాజ్ శాఖకు చెందిన 44 రోడ్ల తాత్కాలిక మరమ్మత్తులకు 1.13 కోట్లు ఖర్చు పెట్టాలని వివరించారు. మూడు మున్సిపాలిటీల పరిధిలో రోడ్ల శాశ్వత మరమ్మత్తులకు 50 లక్షలు ఖర్చు పెట్టాలని.

హరికృష్ణకు మంత్రిత్వం ఇవ్వాల్సిందే!

తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు నందమూరి హరికృష్ణకు మంత్రి పదవి ఇవ్వనందుకు నిరసనగా 31తెది నెల్లూరులో రాస్తారోకో జరిగింది. హరికృష్ణ యువసేన జిల్లా అధ్యక్షుడు కూరపాటి ఈశ్వరరెడ్డి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మకూరు బస్టాండ్, గాంధీ బొమ్మ కూడళ్లలో ఈ రాస్తారోకో జరిగింది. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఈశ్వరరెడ్డి ప్రసంగించారు. ఎన్టీఆర్‌కు అసలైన వారసుడు హరికృష్ణ, ఆయన చలువ వల్లే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. ఇప్పుడదే హరికృష్ణను మరవడం పాలు తాగి తల్లి రొమ్మును గుద్దినట్లుందని విమర్శించారు. యువసేన నాయకులు కె. మధు, గౌస్‌భాషా, అక్బర్, ఆర్. కృష్ణమూర్తి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం దుర్వినియోగం

స్వార్థ ప్రయోజనాల కోసం, ప్రజాస్వామ్యాన్ని ఉపయోగించు

యువసేన రాస్తారోకో

కొంటున్నారే గాని, సమాజ అభివృద్ధి, గూర్చి ఎవరూ ఆలోచించడం లేదని ఎస్పీ టి. పూర్ణచంద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. 30తేది టౌన్‌హాలులో 'కళ' సాంస్కృతిక సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడా రాయన. వ్యవస్థను మార్చను కళాకారులు ఎంతగానో ఉపయోగ పడతారు. అందువల్ల సమాజ శ్రేయస్సు, అభివృద్ధి కోసం కళాకారులు మంచి కళారూపాలు తయారుచేసి ప్రదర్శించాలని సూచించారు. సమాజం మొత్తం కులం, వర్గాలుగా విడిపోవడం దురదృష్ట కరమైన పరిణామాలుగా ఎస్పీ అభివర్ణించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డిపిఆర్ఓ వెంకటరత్నం మాట్లాడుతూ సింహపురి గతంలో కళాకారులకు పుట్టినిల్లై నప్పటికీ, ప్రోత్సాహం తగినంతగా లేకుండా పోవడంతో, ప్రస్తుతం మంచి కళాకారులు తయారు కావడం లేదన్నారు.ఈ సందర్భంగా కళాకారులు ఉషా కృష్ణమూర్తి, బజ్ నవనాథరావు, కాటంరెడ్డి యానాదిరెడ్డి, ఎ. కృష్ణారెడ్డిలను సన్మానించారు.

గూడూరీయులకు టోపీ పెట్టబోతున్న దగా వ్యాపారం!

ఒక వస్తువు విలువలో మూడో వంతు చెల్లిస్తే ఆ వస్తువును ఇచ్చేస్తామని ఒక వ్యాపార సంస్థ చేస్తున్న ప్రచారం గూడూరు ప్రజలను అమితంగా ఆకర్షిస్తూంది. స్టీలు, ఎలక్ట్రికల్ సామాన్లు, ఫర్నిచర్ సామగ్రి మార్కెట్ రేటు కంటే 30శాతం తక్కువ రేటుకే ఇస్తామని గూడూరు తూర్పు వీధిలో ఇటీవలే ఒక సంస్థ వెలసి ప్రచారం చేస్తున్నది. ముందుగాడబ్బులు ముందు చెల్లిస్తే 14 రోజుల్లో వస్తువులు అందిస్తామని నమ్మబలుకు తున్నారు. స్థానికులు కొందరిని ఈ సంస్థలో ఉద్యోగం ఆశ చూపి లోబరచు కొంటున్నారు వీరు. ఈ సంస్థ నిర్వాహకులు గూడూరీయుల నుండి లక్షలాది రూపాయలను వస్తువులకు కట్టించు కొన్నారు. ఈ సంస్థ ఆఫీసులో కేవలం 50వేల రూపాయల వస్తువులు మాత్రమే బయటకు కనపడు తున్నాయి. వీరు ఇప్పటి వరకు ఏ ఒక్కరికీ వస్తువు ఇచ్చిన దాఖలా లేదు. తమిళనాడుకు చెందిన ఈ సంస్థ సభ్యులు గుడారం ఎత్తేస్తే గూడూరు ప్రజలు భారీగా నష్ట పోవడం ఖాయం. ఇటువంటి దగాకోరు సంస్థలు గత పది, పదిహేనేళ్లలో రాష్ట్ర మంతటా - వందకుపైగా వచ్చి, పోయాయి. ప్రతి సంస్థా అమాయక జనం నెత్తిన టోపిపెట్టి లక్షలు, కోట్లు దండుకున్నది. ఇటువంటి వారు చేతులెత్తేసిన ప్రతిసారి లబోదిబో మనడం; ఆ తర్వాత మళ్లీ తెలిసి అదే గోతిలో పడడం అలవాటై పోయింది. మోసం చేయడం ఆ సంస్థ నిర్వాహకుల వృత్తి అయితే కొనచ్చుగాని, అది వారి

> తప్పు
> వ్యాపారులది
> కానేకాదు – తెలిసీ
> వలలో పడుతున్న
> దురాశాపరులది!

నేరం మాత్రం కాదు; వారు మోసం చేస్తారని తెలిసీ వారి గోతిలో పడుతున్న డనానిదే నిజమైన నేరం. పోలీసులు దీనిపై చర్య తీసుకొని పనైదే వారికి అడ్వాన్సు చెల్లించిన వారిని ముందు బొక్కలో త్రోసి, ఆ తర్వాత సంస్థ

యజమానులను పట్టుకోవడం బాగుంటుంది. రెండవసారి ఇటువంటి బుద్ధి తక్కువ పని చేయకుండా వుంటారు.

మోసగాని అరెస్ట్

రైల్వే ఉద్యోగాలు, ఇళ్లస్థలాలు ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి పలువుర్ని మోసగించిన కామిరెడ్డి సుబ్బారెడ్డిని అనే వంచకుడ్ని గూడూరు పోలీసులు అరెస్ట్ చేశారు. గత యేడాది నవంబరులో గూడూరు పలయనంద పురంలో సుబ్బారెడ్డి ఒక బాడుగ ఇల్లు తీసుకొని చేరారు. తాను రైల్వే శాఖలో ఉన్నత ఉద్యోగిగా పనిచేసి రిటైర్డ్

అయ్యానని, పలుకుబడిగల వాడినని నమ్మబలికాడు. నిరుద్యోగి అయిన మునగా రామకృష్ణ అనే యువకుడి వద్ద రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని 60వేల రూపాయలు తీసుకొన్నాడు. మరొకరి వద్ద ఇళ్లస్థలాలు ఇప్పిస్తానని 30వేల రూపాయలు, మల్లిఖార్జున రాజా అనే నిరుద్యోగివద్ద రైల్వే గేట్‌మెన్‌గా ఆర్డర్ ఇప్పిస్తానని మరో 10 వేలు, ఇంకా పలువురి వద్ద వేలాది రూపాయలు వసూలు చేశాడు. చాలా రోజుల పాటు ఉద్యోగాల కోసం ఎదురు చూసిన నిరుద్యోగులు చివరికి జరిగిన మోసం తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొరవ 11 పేజీలో

మాగుంట కృష్ణ మంత్రిత్వం కోసం రాస్తారోకో చేస్తున్న యువసేన కార్యకర్తలు, వారి నాయకుడు కౌన్సిలర్ కూరపాటి ఈశ్వరరెడ్డి

అనంత సాగరంలో నివాస ముండే ఉద్యోగే కన్పించడం లేదు

అనంతసాగరం మండలంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు స్థానికంగా నివాసం ఉండక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందు లెదుర్కొంటున్నారు. తమ పిల్లలకువిద్యా, ఆరోగ్య, వసతులు సాకుగా చూపి ఉద్యోగులు దూర ప్రాంతాల నుంచి వస్తున్నారు. దినసరి ప్రయాణాల వల్ల ఆఫీసు కార్యకలాపాలు లేటుగా మొదలవు తున్నాయి. వర్షాలు, రాస్తారోకోలు, బంద్‌ల సమయంలో ప్రభుత్వ కార్యాలయాలు అనధికారికంగా మూత పడుతున్నాయి. అత్యవసర శాఖలైన రెవిన్యూ, వైద్య, విద్యుత్ శాఖల్లో పనిచేసే సిబ్బంది స్థానికంగా నివాస ముండాలనే నిబంధన ఉన్నప్పటికీ అది అమలు జరగడం లేదు. ఉద్యోగం చేసేచోట ఉద్యోగు లుండాలన్న నిబంధనను జిల్లా అధికారులు ఖచ్చితంగా అనువర్తింప జేయాలి.

శ్రమదానంలోనూ కావలి ఫస్ట్ - కలెక్టర్!

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన శ్రమదాన కార్యక్రమంలో కావలి, జిల్లాలోనే ప్రథమ స్థానంలో వుందనీ; ఇదే బాణీలో కావలి మున్సిపాలిటి కొనసాగితే రాష్ట్రంలోనే ముందంజలో వుంటుందని కలెక్టర్ చెప్పారు.

కావలి పాతవూరులోని కుక్కలగుంట రోడ్డుకు 30తేది కలెక్టర్ శంకు స్థాపన చేసి మాట్లాడారు. ఈ రోడ్డుకు 5లక్షల రూపాయలు మంజూరయ్యాయని, స్థానిక రైతులు దీనిని శ్రమదానం క్రింద తీసుకొని మరో 100మీటర్ల రోడ్డును యిదే పైకంతో వేసుకుంటున్నందుకు ఆనందంగా ఉందన్నారు. శ్రమదానం పథకంలో జిల్లాలోనే అత్యధిక పనులు కావలిలో జరిగాయని, శ్రమదానం పథకం నిధులకు కొరత లేదని, ఎవరైనా ఏ సమయంలోనైనా పని చేసేందుకు ముందుకు వస్తే కోరినన్ని పనులు మంజూరు చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

జిల్లాలో శ్రమదానం క్రింద 10కోట్ల రూపాయలు మంజూరు గాగా నాలుగు కోట్ల రూపాయల పనులు మాత్రమే పూర్తి అయ్యాయని కలెక్టరు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీల కతీతంగా అన్ని పార్టీల నాయకులూ పాల్గొనడం విశేషం.

రాపూరు పోలీసులు నిత్యం కీచులాడు కొంటున్నారు!

క్రమ శిక్షణకు మారు పేరుగా నిలవాల్సిన పోలీసులు చీటికి మాటికి వీధుల్లో పడిపోతున్నారు. స్టేషన్ లాభాల్లో పంపకం విషయమై రాపూరు పోలీస్ స్టేషన్‌లో తరచూ గొడవలు జరుగు తున్నాయి. ఎస్ఐ అధికార పార్టీకి అనుకూలంగా, కొందరు పోలీసులు ప్రతిపక్ష పార్టీలకు అనుకూలురుగా వ్యవహరిస్తున్నారు. మామూళ్ల విషయమై నేరుగా తనను కలవని వారిపై ఎస్ఐ తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఎస్ఐ

జిల్లావార్తలు

పుణ్యాన ఈ మధ్య పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అక్రమ కేసుల్లో ఇరుక్క పోయారు. పోలీసులు, ఎస్ఐలు ప్రతిరోజూ ఏదో విషయమై గొడవ పడడం చూసే వారికి అసహ్యంగా ఉంది. ఒకసారి పరిశీలించండి ఎస్పీ గారూ!

పొదుపులో రాష్ట్రంలోనే కావలి ఫస్ట్!

పొదుపు లక్ష్మి పథకం క్రింద యిప్పటికి కోటి రూపాయలకు పైగా పొదుపు చేసి రాష్ట్రంలోనే కావలి ప్రథమ స్థానంలో వుందని, పొదుపు లక్ష్మి జిల్లా ఇన్‌ఛార్జి కుసుమ కుమారి చెప్పారు.

మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆమె ఈ విషయం వెల్లడించారు. 1993లో అప్పటి జిల్లా కలెక్టర్ సాంబశివరావు ప్రారంభించిన ఈ పథకం క్రింద కావలి మండలంలో అత్యధికంగా కోటి రెండు లక్షల రెండు వేల రూపాయలు పొదుపు చేశారట. 10,026 మంది 293 గ్రూపులుగా ఏర్పడి ఈ మొత్తాన్ని పొదుపు చేసినట్లు ఆమె వివరించారు.

ఈ పథకంలోని 178 గ్రూపులకు డ్వాక్రా పథకం ద్వారా యిప్పటికి 26లక్షలా రూపాయలు రుణాలుగా మంజూరు చేశారట. అదే విధంగా చిన్న వ్యాపారులకు స్వయం ఉపాధి క్రింద వాణిజ్య బ్యాంకుల ద్వారా రుణాలుగా మంజూరుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారామె. ఇప్పటికి మండలంలోని 25 గ్రూపులుకు 8లక్షల పదిహేను వేల వాణిజ్య బ్యాంకులు అప్పులిచ్చాయని రూపాయలను వాణిజ్య బ్యాంకు ఆమె తెలియ జేశారు.

టైసం పథకం క్రింద కావలికి కుట్టు శిక్షణా కేంద్రం మంజూ రయ్యిందని ఒక దానిలో 25 మంది పొదుపు లక్ష్మి మహిళలకు 6నెలల శిక్షణ ఇవ్వడంతో పాటు ఈ కాలంలో 300 రూపాయలు స్టైఫండు కూడా ఇస్తారని తెలియ జేశారు.

సాహిత్య సదస్సు వాయిదా

జనవరి మొదటి వారంలో విడవలూరులో కవికోకిల దువ్వూరి రామిరెడ్డిపై జరగాల్సిన సాహిత్య సదస్సు వాయిదా పడింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమం వల్ల జనవరి చివరి వారంలో ఈ సదస్సు నిర్వహిస్తామని కార్యక్రమ పర్యవేక్షకుడు డాక్టర్ టి. గోపాలకృష్ణా రావు తెలియ జేసారు.

పాత వినతులన్నీ చెత్తబుట్టలో వేసి కొత్తవి తీసుకోవడం ఎందుకు!

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనాలని కావలి మునిసిపాలిటి ఏకగ్రీవంగా తీర్మానించింది. డిసెంబరు 31తేది మధ్యాహ్నం జరిగిన మున్సిపల్ సమావేశంలో కమీషనర్ రాఘవులు జన్మభూమి పథకాన్ని వివరించి పార్టీల కతీతంగా అందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వైస్ ఛైర్మన్ గ్రంధియానాది శెట్టి మట్లాడుతూ శ్రమదానంలో పూర్తిగా సహకరించిన కలెక్టరు, ఆర్.డి.ఓను అభినందించారు. అయితే ప్రజల వద్దకు పాలనలో స్వీకరించిన విన్నపాలకు విలువే లేకుండా పోయిందన్నారు. కావలిలో ఒక్క రేషన్ కార్డు కూడా యివ్వలేదని, తిరిగి మరలా జన్మభూమిలో ఎలా విన్నపాలు స్వీకరిస్తారని ప్రశ్నించారు.

కౌన్సిలర్ బాల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వపు ఆర్థిక దివాళాకోరు తనాన్ని ఈ పథకం ద్వారా ప్రజలకు తెలియజేసి మద్యపాన నిషేధాన్ని ఎత్తి వేయడానికి ముఖ్యమంత్రి పన్నాగం

> జన్మభూమికి
> మద్దతిస్తూనే–
> అధికార్లను నిలదీసిన
> కావలి కౌన్సిలర్లు

పన్నినట్లు చెప్పారు. అయితే ఈ కార్యక్రమం ద్వారా కొన్ని మంచి పనులు చేసే అవకాశం వున్నందున అవి చేపట్టామని ఆయన చెప్పారు. ప్రజల వద్దకు పాలనలో స్వీకరించిన 12వేల విన్నపాలు కావలి మునిసిపాలిటి పరిధిలో పెండింగ్‌లో వున్నాయని కమీషనర్ చెప్పారు. కౌన్సిలర్ తోట శ్రీహరి పట్టణంలోని పారిశుధ్యం, పందుల నివారణ గత మూడు నెలలుగా మునిసిపల్ అజెండాలో చేర్చడం లేదని ఆరోపించారు. సమావేశానికి ఛైర్ పర్సన్ శ్రీమతి చలంచర్ల దేవసేన అధ్యక్షత వహించారు.

బ్లాకులో కిరోసిన్

వెంకటగిరిలో చౌక దుకాణాలకు సరఫరా చేసే కిరోసిన్ బ్లాక్ మార్కెట్‌కు తరలి పోతూన్నది. ఈ కిరోసిన్‌ను బ్లాక్ మార్కెటీర్లు లీటరు 12రూపాయలకు అమ్ముతున్నారు. నెల చివరి రోజుల్లో ఈ వ్యాపారం నిరాటంకంగా కొనసాగు తుంది. పౌర సరఫరాల శాఖాధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదు.

నెల్లూరు ముచ్చట్లు
విలక్షణుడు

ఐదుశాఖల మంత్రికి వళ్లలిసే శ్రమ

కొత్త మంత్రిత్వం మోజులో సన్మా..లు, సత్కారాలతో పొద్దు పుచ్చవలసిన ఐదు శాఖల మంత్రి శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డికి జన్మభూమి పెద్ద తలనొప్పి అయిపోయింది. జిల్లాలో ఆ కార్యక్రమం బాగా జరిపించి, ముఖ్య మంత్రి దగ్గర మెరిట్ మార్కులు కొట్టేయను ఇల్లు, వళ్లు మరచి తిరుగు తున్నారు. పొద్దుటి నుంచి రాత్రి వరకు పల్లెపల్లె తిరగడం; పొద్దుగ్రుంకిన తర్వాత ఎక్కడ అలుపొస్తె అక్కడ పడకేయడం; దారి ప్పిన బాటసారి వలె తిరుగు తున్నాడు పాపం!

జనవరి 1 తేది రాత్రి మైపాడు పట్టపు పాళెంలో పవళించాడు; 2 తేది రాత్రి సాత్‌మోపూరు చేనేత ార్మికుల కాలనీలో సేదదీరాడు; ఈ ఏడు రోజులూ ఇదే తీరులో సత్రం బోజనం, మఠం నిద్ర అట.

పెద్దాస్పత్రికి దొడ్ల శేషారెడ్డి దానం

నెల్లూరు పెద్దాస్పత్రి భవనానికి, మంచాలు గింజాలకు రిపేర్లు చేయించి; నివాస యోగ్యం చేయడానికి సిద్ధపడ్డారు శ్రీ దొడ్ల శేషారెడ్డి. పెద్దాస్పత్రి రిపేర్లకు ప్రభుత్వం పదిలక్షలు మంజూరు చేసింది. ఆ పని తాను చేపట్టి, కొరవ ఎంత పడినా భవనానికి పునః వైభవం చేకూ ముందుకు వచ్చారు శేషారెడ్డి.

నెల్లూరు పెద్దాస్పత్రి, డికెడబ్ల్యు కాలేజి భవనాలు స్వర్గీయ దొడ్ల సుబ్బారెడ్డి కట్టించినవే. తన నిధులు ఖర్చు పెట్టడమే కాకుండా, తానే శ్రమపడి, దగ్గరుండి ంత సుందర భవనాలు సమకూర్చా రాయన ఈ రెండింటికి. ఇన్నేళ్ల తర్వాత ఆయన సోదరుడి కుమారుడు శ్రీ శేషారెడ్డి ఆ పుణ్య కార్యానికి వన్నె తెస్తున్నారు.

డికె కాలేజి భవనానికి కూడా రంగులు వేయించడం, లెకెజిలు రిపేరు చేయించడం; మంచినీటి వసతి కోసం పైప్‌లైన్ వేయడం తదితర పనులనూ శేషారెడ్డి తన బాధ్యతగా స్వీకరించారు. వీటన్నింటికి ఇంచు మించు 10 లక్షలు ఖర్చు పెట్టడానికి సిద్ధపడ్డా రాయన.

జిల్లాలో నిజమైన వదాన్యులు అనదగిన కుటుంబం దొడ్ల శేషారెడ్డిది. ఎందరో సంపన్ను లున్నారు మనకు; రాజకీయాలకు, విలాసాలకు, ముఖప్రీతి పొగడ్తలకు, భజన పరుల అచ్చగింపు మాటలకు, దర్గాలకు లక్షలు, కోట్లు దుబారా చేస్తుంటారు. దానాలు చేసివారూ లేకపోలేదు. కాని వారెవ్వరి వదాన్యతా – జిల్లా ప్రజానీకానికి శాశ్వత ప్రయోజనకర సంస్థలు ఏర్పడేందుకు వుపకరించ లేదు. తాత్కాలిక ప్రచారాలకు మాత్రమే పనికి వచ్చాయవి. ఒక్క దొడ్ల సుబ్బారెడ్డి కుటుంబీకులు చేసిన దానాలు మాత్రమే – టౌన్‌లో పెద్దాస్పత్రి, డికె కాలేజి, దొడ్ల పద్మావతమ్మ గ్రంథాలయం, దొడ్ల చెంచురామ రెడ్డి జిప హైస్కూళ్లను అందంగా, సర్వసౌకర్య విలసితంగా నడిపింప జేస్తున్నాయి. తండ్రి, పినతండ్రిల నుంచి సార్థక దాన స్వభావాన్ని తాను వారసత్వంగా స్వీకరించిన శేషారెడ్డిని మనసారా అభినందిస్తున్నాం.

ఎందువల్లనో ఈ కుటుంబీకులకు దానం చేయడం తప్ప, ప్రచారం కోరడం ఇష్ట నుండదు. అందువల్లే వారి దా లకు వారి సంస్థలే మౌన ప్రచారం కల్పిస్తుంటాయి.

కలెక్టర్‌తో ప్రిన్సిపల్ గొడవ

జిల్లా కలెక్ట ్టర్ డి. సాంబశివ రావు గా , వేణుగోపాల స్వామి ాలేజి ప్రిన్సిపల్ శ్రీ సిహెచ్. మోహన రెడ్డికి మధ్య పెద్ద గొడవ జరిగింది. జన్మభూమి కార్యక్రమంలో పాల్గొనడానికి తమ కాలేజి విద్యార్థులకు సైదాపురం వంటి దూర ప్రాంత గ్రామాలు కేటాయించారని; అంత దూరం వెళ్లడానికి వారు ఇష్టపడడం లేదు కాబట్టి దగ్గరలో ఎక్కడైనా పని చెప్పమని కలెక్టర్‌ను అడిగారట ప్రిన్సిపాల్. అప్పటికే విఆర్ లా, సర్వోదయ, తదతర కాలేజి ప్రిన్సిపల్స్ ఈ కార్యక్రమంలో తాము పాల్గొన బోవడం లేదని చెప్పి వెళ్లిపోవడంతో చిర్రెత్తి వుండిన కలెక్టర్ – ఆ విసుగులో మోహన రెడ్డిని కసురు కున్నారట. కాలేజి ప్రిన్సిపల్ వంటి గౌరవప్రద పదవిలో వుండే వ్యక్తులు – పది మంది ఎదుట పరుష పదజాలం వాడితే సహించడం కష్టం కదా? ఆయన కలెక్టర్‌తో వాగ్వివాదానికి దిగారు. ఇద్దరి మధ్య ఆవేశాలు పెరిగి పోయాయి. గొడవ పడ్డారు.

ఈ సంఘటనపై టౌన్‌లోని అన్ని కాలేజిల ప్రిన్సిపల్స్, అధ్యాపక సంఘాల నాయకులు తమ నిరసన తెల్పారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసేదిగా వున్న ఈ సంఘటనపై కలెక్టర్ పశ్చాతాపం వ్యక్తం చేయాలని కోరుతున్నారు వారు.

ఇద్దరూ గౌరవనీయ సంస్థలకు ప్రతినిధులే; సామరస్యంగా సమస్య పరిష్కరించు కోవడం సమంజసం!

విశాలాంధ్ర వీడ్కోలు

నెల్లూరు విశాలాంధ్ర విలేఖరి శ్రీ కెవి రమణయ్య పదవీ విరమణ చేశారు. 27 ఏళ్ల నుంచి విశాలాంధ్ర సేవలో వున్నారు రమణయ్య. సేవ అని ఎందు కంటున్నా మంటె – జీతం కోసం కాకుండా, ఒక కమిట్ మెంట్‌తో పనిచేయుటమే! విశాలాంధ్ర ఇచ్చే జీతాలతో ఎవరి పొట్టలూ నిండవు.

రమణయ్యది స్నేహ స్వభావం. కొంచెం ఆవేశం, మాట దుడుకుతనం ఎక్కువైనా వివాదాలు సృష్టించు కొనేవాడు కాదు. విలేఖరిగా విజాయితీ పాటించిన వాడు. ఆత్మగౌరవంతో బ్రతికిన వాడు. లైై ఆంధ్ర ఫంటి ఉద్యమాలలో ఎదిరికెదురీది నడవ వలసి వచ్చినా జంకలేదు. సిపిఐ పార్టీ పట్ల, వృత్తి పట్ల అంకిత భావం ఫలితమది. ఇప్పటి దినపత్రికల రిపోర్టర్ల మధ్య పాతకాలం విలేఖరులు మన గలగడం చాలా కష్టం; రిటైర్మెంటె బెస్ట్.

నెల్లూరులో చాలా కాలం వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్‌కు రమణయ్య సారథి; అందుకు గుర్తుగా 4 తేది ఆయనకు అభినందన సభ జరుగు తుంది.

పామోలిన్‌కు జిల్లా మొత్తానికి అర్హత

పామోలిన్ తోటల పెంపకంలో సబ్సిడీలకు నెల్లూరు జిల్లా మొత్తాన్ని అర్హురాలిగా ప్రకటించింది ప్రభుత్వం. ఇప్పటి వరకు విడివిడిగా కొన్ని మండలాల వరకె ఈ సౌకర్యం వుండేది. ఇక నుంచి నేల అనుకూలత, నీటి వసతి కల్గిన ఏ ప్రాంతంలో పామోలిన్ తోట ఎంచినా – హెక్టారుకు 16 వేల 250 రూపాయల విలువైన సబ్సిడీని – మొక్కలు, ఎరువుల రూపంలో అందిస్తారు.

జెకె రెడ్డి, జెఎస్ రెడ్డి సోదర ద్వయం శ్రీ సామంతు గోపాల రెడ్డితో కలిసి నిర్మించిన సింహపురి ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రైతులకు పామోలిన్ తోటల విషయంలో మొక్కల సరఫరా, సాంకేతిక సహకారం అందిస్తుంది. తమ స్వంత తోటలో పామోలిన్ పెంచి దాని లాభదాయకతను రుజావు చేసి చూపించారు వారు. ఏ వివరాలు కావాలన్నా రైతులు వారి కార్యాలయంలో సంప్రదించ వచ్చు.

వెంకయ్యస్వామికి కొత్త నిర్వాహకుడు

గొలగమూడి వెంకయ్య స్వామి గుడికి వస్తున్న ఆదాయం – దాని నిర్వాహకులకు పళ్లు పులుపెక్కేలా చేస్తుంది. ఎండోమెంట్స్‌కు సంబంధం లేకపోవడంతో – వచ్చిన దంతా తినమరిగారు వారు. పంపకాలలో పేచీలు వచ్చి కోర్టుకెక్కితే – ఒక రిసీవర్‌ను నియమించింది న్యాయ స్థానం. మాజీ పిపి శ్రీ రామకృష్ణకు ఆ బాధ్యత అప్ప చెప్పారు. నిర్వహణ ఖర్చుల వరకు వాడి, తతిమాది బ్యాంకులో డిపాజిట్ చేసి, కోర్టుకు లెక్కలు చెప్పడం ఆయన పని. బ్రహ్మకైనా రిమ్మ తెగులు పుడుతుందని పెద్దలు వూరకె అనలేదు కదా – చేతిలో కాసుల గలగలలు ఆయన్ను మైమరపించి వన్నున్నాయి; బ్యాంకుకు వెళ్లాల్సిన సొమ్ము ఇంటికి తరలి వెళ్లింది. ఒక భక్తుడు దీనిపై కోర్టుకు ఫిర్యాదు చేయడంతో – కోర్టు ఆయన్ను పూరబెరికి నలుగురు న్యాయవాదుల కమిటీని నియమించింది. రామకృష్ణ నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశించింది. అడ్వొకేట్ శ్రీ వెంకట రమణయ్య ఈ విచారణ జరుపుతారు.

వెంకయ్య స్వామికి ఏడాదికి పాతిక లక్షల పైన ఆదాయం వస్తుంది; అంతే విలువైన బియ్యం కూడా వస్తాయి. వీటిని దుబారా చేసేకంటె ఏదైనా సత్కార్యం జరిపించ డానికి న్యాయ స్థానం ఆదేశాలివ్వ గల్గితే వెంకయ్య స్వామి సంతోషిస్తాడు. ఆయన పేరుతో ఒక పేద విద్యార్థుల హాస్టల్ నడపడం బాగుంటుంది.

వింజమూరులో తుపాకీ కాల్పులు

తుఫాన్లకు తమలపాకు తోటలకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం పట్టించు కోవడం లేదనే ఆగ్రహంతో,

కొరవ 7 పేజీలో

బాబీ పరమపదం!

బాబీ

15.12.83 — **15.12.96**

మమ్ము ఇన్నేళ్ల రెప్పలా కాపాడిన మా బాబీ –
పుణ్యక్షేత్రాలు దర్శించిన మా బాబీ – దైవసన్నిధి చేరింది.
ఆజన్మాంతం నిన్ను మరువలేని –

-- వనమాలి కుటుంబం

నూతన సంవత్సర, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలతో
జగన్నాథం గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వారి

జగన్నాథం బెనిఫిట్ ఫండు లిమిటెడ్

(ఉమ్మడి పెళ్లి పనుల కార్యాలయము)
సాలుచింతలు – నెల్లూరు - 524 005
(కోవూరు క్రాస్ వెంకయ్యస్వామి గుడి వద్ద)

నెల్లూరు టౌన్ ప్రజలకు శుభవార్త!

అన్ని విధములైన పెళ్లి పనులకు మాతో సంప్రదించండి. మీరు కోరుకున్న రీతిలో అనుకున్న సమయమునకు ఆనంద ఉత్సాహముతో మీ పెళ్లి పనులను నిర్వహించగలము. వధూవరులిదరూ ప్రభుత్వ ఉద్యోగులైనచో పెళ్లి పనులకు గాను రూ 30,000-00లు అప్పుగా తగిన హామీతో ఇవ్వగలము.

ఎన్. జగన్నాథం -- ప్రొప్రయిటరు

ముసునూరువారి పాళెం PACS

రిజిష్టరు నెం. K572, ముత్తుకూరు మండలం, నెల్లూరుజిల్లా.

నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండంలో గల జంగాల కండ్రిగ గ్రామ కాపురస్తుడగు పలగాని నారాయణరెడ్డి గారి కుమారుడు భాస్కరరెడ్డి గారు ముసునూరువారి పాళెం PACS నందు పైపులైను కొరకు అప్పు దరఖాస్తు చేసియున్నాడు. ఈ అప్పుకుగాను ముత్తుకూరు సబ్‌రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్టరు కాబడిన డాక్యుమెంటు నెం. 222/1977 (222/77) తేది 2.5.77 ద్వారా సదరు భాస్కరరెడ్డి గారు విక్రయము పొందియున్నారు. బ్రహ్మదేవం గ్రామ లెక్కల దాఖలా స.నెం.563లో గల విస్తీర్ణం య. 4.50 సెంట్లు భూమిని హామీగా చూపియున్నారు.

సదరు దస్తా వేజు పోయినందున నకలు పత్రము దాఖలు చేసియున్నారు. ఈ ఆస్థిని తాకట్టు పెట్టుకొనుటకు ఎవరికైనా ఏ విధమైన ఆక్షేపణలున్న ఎడల ఈ ప్రకటన తేదినుండి 10 రోజులలోగా మా సంఘము వారికి తెలియ జేయవలసినది.

M. సుబ్బరామిరెడ్డి — ప్రెసిడెంటు
Ch. బుజ్జయ్య — కార్యదర్శి

రొయ్యలపరిశ్రమ

మొదటిపేజి కొరవ

వర్తిస్తుంది. ఈ నోటిఫికేషన్‌లో హేచరీలను మాత్రం మినహాయించారు. కాని 1995 ఫిబ్రవరి 19 తేది కొత్తగా జారీ చేసిన సిఆర్‌జెడ్ నిబంధనల ప్రకారం హేచరీలను సైతం 250 మీటర్ల వరకు నిర్మించరాదు.

ఈ చట్టాన్ని యదాతథంగా అమలు జరపాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఆ ఉత్తర్వును అమలు పరచడంలో అలసత్వం ఏర్పడ కుండా – అందుకు ఆయా జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలను బాధ్యులను చేశారు. వీరు తమ సిబ్బందితో 500 మీటర్ల లోపు వున్న రొయ్యల చెరువులను, ఇతర పరిశ్రమలను, కట్టడాలను మార్చి 30 తేది లోపల ధ్వంసం చేసి, ఏప్రెల్ 15 తేది లోపల సుప్రీం కోర్టుకు నివేదిక సమర్పించాలి. తమ ఉత్తర్వులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కాకుండా, నేరుగా అధికారులకు జారీ చేయడం ద్వారా తీర్పు అమలును తానే పర్యవేక్షించ దలచినట్లుంది సుప్రీం కోర్టు. అందువల్ల ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేయగల్గింది ఏదీ లేదు.

ఈ తీర్పు విషయంలో కొన్ని వివరణలు అవసరమౌ తున్నాయి. సిఆర్‌జెడ్ నిబంధనల ప్రకారం నదులు, కాలువల వంటి వాటికి 500 మీటర్ల దూరం – ఆ దూరం ముఖ ద్వారం నుంచా లేక వాటి పొడవునా లేక వెడల్పునా పాటించ వలసింది – అనే విషయంలో సందిగ్ధ పరిస్థితి వుంది. హైటైడ్ లైన్ నిర్ణయం ఎవరు చేస్తారనేది ఒక ప్రశ్న. సిఆర్‌జెడ్ నిబంధనలలో కాలువల వెడల్పు లేదా 100 మీటర్ల దూరం వరకు ఖాళీగా వుంచాలని వుంది. అది ఎంత వరకు వర్తిస్తుందన్నది ప్రశ్న. ఈ పరిధిలోని రొయ్యల చెరువులు, హేచరీలను ధ్వంసం చేయడానికి ఎవరు ఖర్చు భరించాలన్నది ఇంకో ప్రశ్న.

500 మీటర్ల పరిధి దాటిన రొయ్యల చెరువులూ – సుప్రీం కోర్టు తీర్పు ద్వారా ఏర్పడనున్న అథారిటీ నుంచి అనుమతి తీసుకొని సాగు ప్రారంభించాలి. అనుమతి లేకుండా సాగు చేయడం కోర్టు ధిక్కారం క్రింద పరిగణ నౌతుంది. అయితే ఆ అనుమతులు ఎట్లా వుంటాయన్నది అస్పష్టం. సెమి ఇంటెన్సివ్ కల్చర్‌కు ఆంక్షలు అధికంగా వుండేట్లున్నాయి. రొయ్యల చెరువుల వల్ల పంట పొలాలకు, మంచినీటి బావులకు, దారి డొంకలకు నష్టం కల్గితే రొయ్యల రైతులే భరించాలన్నది చాలా తీవ్రమైన ఉత్తర్వు. దీనివల్ల ప్రతి రైతూ ఏదో ఒక సమస్యతో ఎప్పుడూ సతమతం కావలసి వస్తుంది. ఇప్పటికే జరిగిన నష్టాన్ని రైతుల నుంచి వసూలు చేయమని ఆదేశించింది సుప్రీం కోర్టు. అది రొయ్యల రైతులకు అశనిపాతం వంటి ఆదేశం. ఎవరే ఫిర్యాదు చేసినా – ఆస్తులు చాలవు నష్టపరిహారం కట్టివ్వ డానికి. తీర్పులోని ప్రమాదకర భాగం ఇదే!

మొత్తం మీద సుప్రీం కోర్టు తీర్పు అసలే సంక్షోభంలో వున్న రొయ్యల పరిశ్రమను మరింత కష్టాల పాల్జేసింది. వైరస్ వ్యాధులతో, మత్స్యకారుల ప్రతిఘటనతో, పత్రికల ప్రతికూల ప్రచారంతో, ఎగుమతిదారులు, మేత కంపెనీల దోపిడితో కునారిల్లుతున్న రైతులను మరింత దెబ్బతీసింది.

దీనిపై ఎవరు చేయగల్గింది ఏమీ లేదు. సుప్రీం కోర్టును మళ్లీ శరణు వేడడమే మార్గోపాయం. న్యాయవాదుల వాదాలపై కాకుండా, లీగల్ పాయింట్ల ఆధారంగా కాకుండా – అక్వా కల్చర్ నిపుణుల నివేదికల తోడ్పాటుతో చేసిన ఈ తీర్పు నుంచి రైతులకు అంత సులభంగా ఉపశమనం లభించడం కష్టం. ఓర్పుతో ఫుల్‌బెంచ్‌కు వెళ్లి, రివిజన్ పిటిషన్ దాఖలు చేసి న్యాయం కోరవలసిందే!

పశువుల మందులు

అన్ని ప్రముఖ కంపెనీల పశువుల మందులు మా వద్ద లభించును.

వివేకా మెడికల్స్

16/1295/3, పొగతోట

నెల్లూరు. ఫోన్: 27691

నెల్లూరు జిల్లా గ్రామ స్వరాజ్య సంఘం, కందుకూరు

గొప్పతగ్గింపు 25%

సంక్రాంతి పండుగ సందర్భంగా ఖాదీ వస్త్రాలపై రూ.1టికి 25 పైసలు రిబేటు 10.12.96 నుండి 20.1.97 వరకు ఇవ్వబడును.

పొందూరుపై 20%, పాలియస్టరు పై 15%, సిల్కుపై 10% రిబేటు ఇవ్వబడును.

గమనిక: నెల్లూరు టౌన్‌లో కేంద్ర, రాష్ట్ర గవర్నమెంటు వారి అనుమతి పొందిన ఖాదీ భాండారు ఇది ఒక్కటేనని గమనించ కోరుచున్నాము.

మేనేజరు

ఖాదీ భాండారు

అలంకార్ లాడ్జి ఎదురుగా, కాపువీధి, నెల్లూరు-524 001

అశ్రుతర్పణం

మా తాత గారైన

దువ్వూరు సుందరరామిరెడ్డి గారు

27.12.96న పరమ పదించినారు. వారి ఉత్తర క్రియలు -

10.1.97 నిలుపు — 11.1.97 ఎత్తురేవు శిలోద్వాసన

వెంకన్నపాళెం గ్రామంలో మా స్వగృహమున జరుగును. వారి ఆత్మకు శాంతి ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తూ...

దువ్వూరు గంగాధరరెడ్డి   దువ్వూరు రామకృష్ణారెడ్డి

(మనుమలు)

జన్మభూమి

మొదటిపేజి కొరవ

కోణం నుంచి మాత్రమే వార్తలు రావడం వల్ల ప్రజలను మభ్య పెట్టడానికి వీలౌతున్నది. ఆయన పరిపాలనా, కార్యదక్షత లంతా పత్రికా యజమానులు, విలేఖర్లతో ఏర్పర్చుకున్న సత్సంబంధాలలోనే వ్యక్తమౌ తున్నాయి. రాజకీయ చతురత అంటే అదీ. కాంగ్రెస్ నాయకులు బుద్ధి తెచ్చుకో వలసిన సంగతి ఇది.

నెల్లూరుముచ్చట్లు

6వ పేజీ కొరవ

డిసెంబరు 31 తేది వింజమూరులో రైతులు జరుపు తుండిన నిరసన ప్రదర్శన – అదుపుతప్పి పోలీసు కాల్పుల వరకు దారితీసింది. అదృష్టవశాత్తు ఎవరూ గాయపడ లేదు.

వైటి పార్టీ మార్పిడి – నిప్పులేని పొగ!

ఎన్టీఆర్ టిడిపి నెల్లూరు టౌన్ నేత వైటి నాయుడు తెలుగు తీర్థం సేవించనున్నాడట. వాస్తవానికి ఆయన చేయి చాచినా చంద్రబాబు తీర్థం గిన్నె ప్రక్కకు లాగేశాడనీ దినపత్రికలు వ్రాశాయి. దేముడివ్వ బోయే వరానికి రమేష్ రెడ్డి పూజారి వలె అడ్డుపడ్డాడని వూహాగానం.

కానీ ఈ వార్తలన్నీ నిప్పులేని పొగలే. వైటి నాయుడు పార్టీ మారే ఆలోచన కాని, ఆ ప్రయత్నం కాని లేవు. అతడింకా మునిసిపల్ ఎన్నికల ఓటమి వైరాగ్యం నుంచి బయట పడలేదు.

కొందరు రాజకీయ వాదులు ఎప్పుడే పార్టీ అధికారంలో రానున్నదో కనిపెట్టి, ఆఖరు నిముషంలో టపీమని అటు గోడదూకే స్తుంటారు. అదేమి దురదృష్టమో తెలియదు కాని, వైటి అడుగు పెట్టిన పార్టీ అనధికారంగా మిగులుతుందే తప్ప అధికారంలో వున్నప్పుడు ఆ ప్రక్కకు వచ్చే నిర్ణయం తీసుకోలేదు. వైటి రాజకీయ జాతకంలో ఏన్నాళ్ల శని ఇంకా తొలగినట్లు లేదు. లేకుంటే 1983 లోనే ఆ స్థానంలో ఎమ్మెల్యే అయ్యేవాడు. ఇంకా నిర త్యే

గానే వుండి పోతున్నారు బ్యాడ్ లక్!

నవయుగం దశయ్య కాలధర్మం

నవయుగం వార పత్రిక సంపాదకుడు శ్రీ జి. దశరథ రామయ్య 29 తేది మరణించారు. ఆయన వయస్సు 70 సంవత్సరాలు. భార్య, ఐదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు వున్నారు.

దశరథ రామయ్యది విచిత్ర వ్యక్తిత్వం. కలెక్టరాఫీసు ఎదుట తన నవయుగం ప్రెస్ కార్యాలయాన్ని పెద్ద రాజకీయ, సాంస్కృతిక, సిద్ధాంత చర్చా వేదికగా తీర్చిదిద్దా రాయన. జీసి కొండయ్య వంటి రాజకీయ మేధావు లెందరికో అది కార్యస్థానం. అన్ని పార్టీలవారూ అక్కడ చేరేవారు; ఏవేవో చర్చలు జరుగు తుండేవి. వాటన్నింటినీ ఆలకించడం, వారందరికీ అరకప్పు తేనీటి ఆతిథ్య మివ్వడం తప్ప తాను మాత్రం వాటికి అతీతంగా వుండే వారాయన. వివాద రహితుడు, స్నేహస్వభావి. టౌన్‌లోని జర్నలిస్ట్ లందరికీ రెండో కంటికి తెలియకుండా సాయపడు తుండేవారు. డెబ్బయ్ ఏళ్ల నిండైన జీవితం గడిపి, పండుటాకు వలె రాలిపోయాడు. వారి కుటుంబానికి మా సానుభూతి.

రేబాల రమణ దుర్మరణం

ప్రఖ్యాత రంగస్థల నటుడు శ్రీ రేబాల రమణ దుర్మరణం పాలైనారు. 31 తేది మధ్యాహ్నం ఆయన సహనటులతో కలిసి చిత్తూరుకు వెళ్తుండిన వ్యాన్ ఎదురుగా వస్తున్న లారీకి ఢీకొనడంతో – అక్కడే నలిగి నజ్జునజ్జు అయిపోయా రాయన. అదే వ్యాన్‌లో వుండిన నటుడు శీనయ్య (35), హార్మోనిస్ట్ రామలింగా రెడ్డి (35) కూడా మరణించారు.

సమకాలీన ఆంధ్ర నాటక రంగంలో రేబాల రమణ అత్యున్నత ప్రతిభా వంతుడైన కళాకారుడు. స్త్రీ పాత్రల్లో రాణించడం ఆయన స్పెషాలిటీ. బాలనాగమ్మగా, హరిశ్చంద్రలో చంద్రమతిగా, సత్యభామగా ఆయన వేదికపై కన్పిస్తే – ఆయా పాత్రలు జీవం పోసుకొని నడిచి వచ్చినట్లే ఫీలయ్యేవారు ప్రేక్షకులు. చెప్తే తప్ప స్త్రీ వేషంలో పురుష నటుడని తెలిసేది కాదు. ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వం పలుసార్లు సత్కరించింది; తెలుగు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌తో సన్మానించింది. ఆయన స్వయంగా శ్రీరామ నాట్యమండలి అనే సంస్థ స్థాపించి ఎన్నో నాటకా లాడారు. ఎందరో యువ కళాకారులకు శిక్షణ ఇచ్చారు. స్త్రీ పాత్రల్లోనే కాకుండా హాస్యపాత్రల్లో; శ్రీకృష్ణుడు, నారదుడు వంటి పౌరాణిక పాత్రల్లోనూ రాణించడం రమణ బహుముఖ ప్రతిభకు నిదర్శనం.

అటువంటి ఉత్తమ కళాకారుడు మనకింకొకరు లేరు. ఆయన మృతి నాటక రంగానికి నిజంగా తీరని లోటు.

బుచ్చిరెడ్డి పాళెం దగ్గర రేబాల ఆయన స్వగ్రామం; వయస్సు 58 సంవత్సరాలు. ఆ కళాకారుడి స్మృతికి మా జోహార్లు.

నెల్లూరు బజారు

మొలగొలుకులు 9674		4,500
9672		4,200
సన్నాలు		3,800
బియ్యం బస్తా	(70 కిలోలు)	680
బంగారు పవను	(8గ్రా)	3,800
వెండి	(10గ్రా)	73

In the Court of the Subordinate Judge, Cuddapahh

S.C.No: 202/96

Bodimalla Ramana Reddy S/o. Vengal Reddy, Chinna Chowk, Cuddapah Mandal & District ... Plaintiff

Vs

Pachcha Lakshumaiah Naidu S/o. Kamaleshaiah Naidu, Diguva Basinaidugari Palli (Vi&Po), Rajampet Mandal, Cuddapah Dist .... Defendent

వాది పై దావాను ప్రతి వాదియైన పచ్చా లక్షుమయ్య నాయుడు గారిపై దావా మొత్తం రు.5492/-ను ఖర్చులు మరియు వడ్డీతో కూడా వసూలు చేసుకొనుటకు దాఖలు చేసియున్నారు. ప్రతివాదికి నోటీసు నిమిత్తము వాయిదా 21.1.97వ తేదికి వున్నది. సదరు తేదిన పై కోర్టు నందు ఉదయం 10-30 గం.లకు హాజరై ఆక్షేపణలున్న యెడల తెలుపుకొన వలసినది. లేనంతట కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించెదరని తెలియ చేయడమైనది.

జి. రామలింగారెడ్డి

Advocate for Plaintiff

నెల్లూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్టు మున్సిఫ్ వారి కోర్టులో

O.P. 23 of 1996

P. విజయకుమార్ .... పిటీషనరు

Vs

P. భీమారావు & యితరులు ... రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

1. పైన తెలిపిన పిటీషనరు. మరణించిన తన తండ్రి P. జోసఫ్ గారి పేర, A.K.నగర్ పోస్టాఫీసు S.B.A/c.No. 1411720 నందు వున్న, రు.21,197-85 మొత్తమునకు తన పేరిట వారసత్వ సర్టిఫికేటు మంజూరు చేయమని కోరుచూ పిటీషను దాఖలు చేసియున్నారు.

2. యిందు విషయమై, మరెవరికైనా, ఆక్షేపణలు ఉన్న యెడల 17.1.97తేది నాడు 10.30 గం.లకు పై కోర్టు నందు హాజరై తెలుపు కొన వచ్చును. లేనిచో వారి పరోక్షమున తీర్మానము చేయబడునని తెలియ పరచడమైనది.

సర్వేపల్లి వెంకట సుబ్రహ్మణ్యం

పిటీషనరు తరఫున అడ్వకేటు

శ్రీశ్రీ వేసిన స్రియలిస్ట్ ప్రశ్నకు ఇంతకాలానికి జవాబు చిక్కింది!

"కాకి కేసిని తెలుసు సైకోఎనాలిసిస్
ఆటవెలది ద్విపద కత్తగారు
5,3,2, ఆముక్తమాల్యద -"

దీని భావమేమి తిరుమలేశ? తలబద్దలు కొట్టుకొన్నా తలకెక్కని పద్యమిది. అట్లని దీనికి అర్థమేలేదు పొమ్మని ఒక్క మాటతో కొట్టిపారెయ్యడం పాడికాదు. స్రియలిస్టు కవన శిల్పం తీరే అంత. ఎంతో తీరికగా, తీరుగా ఆలోచించినా తికమకపెట్టి తిక్కపుట్టిస్తుంది.

దీన్లో ఉన్న సారభూతమైన అంశమేమి? చమత్కారమేమి? ఈ ఆట వెలదిని రంగం మీద నిలిపి, అంతరంగంలో గుబులు రేపి మనల్ని

రాయి–తురాయి

✲ అగ్నిమిత్ర ✲

ఒక ఆట పట్టిస్తున్న ఈ నేటి కవి ఎవరు?

ఇంకెవరు? "ఈ శతాబ్దం నాది" అని ఠాడగొట్టి చెప్పిన యుగకర్త – మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు; గేహానికి, దేహానికి ఉన్న పేర్ల నుండి మొదటి రెండక్షరాలను సంగ్రహిస్తే శ్రీశ్రీ "బీజాక్షర" సాన్వర్థ సార్థక నామధేయ దురంధరుడు. ఇటువంటి స్రియలిస్టు కైతలు ఆయన తప్ప ఇంకెవరు రాయగలరు? కాదంటే - మరొక నారాయణ బాబు కూడా రాయొచ్చుంటారు. అంతే కదా?

ఇంతకూ, స్రియ[illegible]ం అంటే ఏమిటి? దాని లక్ష్యం సరే తెలిసింది; లక్షణమేమిటి? శ్రీశ్రీ లక్షణం కూడా చెప్పారు; ఆ లక్షణం చదివి[illegible] ంత వెర్రెక్కి చిర్రెత్తుతుంది.

"జీబ్రాకు, Algebra చిప్పల
లాంకోటూ. పాంకోళ్లూ తొడిగి
సాహిత్య పౌరోహిత్యం యిస్తే
వెర్రికాదు, Sur-Realism
రాసోదరా!"

ఈ నిర్వచనం మనల్ని నిర్వచనుల్నిగా నిలబెడుతుంది; నొచ్చుట్టల్ని చేస్తుంది.

డా. సి. నారాయణ రెడ్డి గారు తమ "ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయములు: ప్రయోగములు:" అనే పరిశోధన గ్రంథంలో - "5,3,2, 'ఆముక్త మాల్యద'లో - ఆముక్త మాల్యద కొరుకుడు పడని ప్రౌఢ ప్రబంధం కాబట్టి హేళన చేయుటకు ఆ అంకెలను వాడినాడేమో?" అంటూ ప్రశ్నను ప్రశ్నగానే వదిలెయ్యడం విశేషం. పైగా, "అసంబద్ధత, అనర్థకత, శబ్దచమత్కారము, స్రియలిజం లక్షణములని శ్రీశ్రీ చెప్పదలచు కున్నాడు." అంటూ సి.నా.రె. తమ అభిప్రాయాన్ని శ్రీశ్రీకి అంటగట్టె ప్రయత్నం చేశారు. స్రియలిజాన్ని అసంబద్ధ కవిత్వం (absurd poetry)గా అభివర్ణించ వచ్చునేమోగాని, అనర్థకత అని చెప్పడం సబబు కాదు. ఇక చమత్కార మనేది ఏ కవిత్వంలోనైనా ఒక అంశమే. ఇక్కడ సందర్భోచితమైన ఒక ముఖ్య - కాదు - అతిముఖ్య విషయాన్ని ప్రస్తావించక తప్పదు.

60వ దశకంలో ననుకొంటాను - సుప్రసిద్ధ విమర్శకులు కీ.శే. శ్రీపాద గోపాలకృష్ణ మూర్తి గారు "భారతి" లో "ఆధునికాంధ్ర సాహిత్యం"పై ఒక సుదీర్ఘమైన సమీక్ష రాశారు. కొన్ని నెలలపాటు సాగింది ఆ సమీక్ష. అందులో ఆయన శ్రీశ్రీ మహా ప్రస్థానాన్ని మెచ్చుకొంటూనే - ఆ తర్వాత శ్రీశ్రీలో ప్రజ్ఞాపాటవం పటాపంచలై పోయిందనీ, తత్ఫలితంగా ఉబుసుపోకకు "ప్రాసక్రీడలు" ఆడుకొంటున్నాతనీ అంటూ-

"తురాయి కంటె - ఆ
కురాయి కంటె - కీ
మురాయి కంటె - హిమాం
శురాయి గొప్పవాడు"

అనే స్రియలిస్టు కవితను ఉదహరించి ఇది అర్థం లేని రచన పొమ్మన్నారు. మరుసటి నెలలో విశాఖ పట్నం నుంచి 'భారతి'కి ఒక లేఖ వచ్చింది. లేఖకుని పేరు గుర్తు లేదు; అందులోని సారాంశం-

హిమాంశురాయి ఎవరో ఏమిటో తెలియని వారికీ, ఆయన సినిమాలు చూడని వారికీ ఆ పద్యం అర్థం కాదన్నారు. తురాయి శిరఃకోటీర భూషణం; ఆకురాయి ఇనుముకు పదును పెట్టే పనిముట్టు - కీమురాయి పలుకు వి[illegible]క్షణం; కాబట్టి హిమాంశురాయి కళా వైదగ్ధ్యం కూడా అటువంటిదేనని ఆ కవితలోని భావం అంటూ వ్యాఖ్యాన సహితంగా వ్రాసి - "మహా కవుల మాటల వెంట అర్థం పరుగెడుతూనే ఉంటు[illegible]" [illegible] వాక్యంతో తన లేఖను ముగించాడు. కాబట్టి శ్రీశ్రీ స్రియ[illegible]స్టు పద్యాలు నిరర్థకమనో, అనర్థకమనో [illegible] మాటతో నెట్టి వెయ్యడం మన [illegible] మనమే మొట్టికాయ వేసు[illegible]

శ్రీశ్రీ అంటాడు - "ప్రశ్నను లెస్సగా అధ్యయనం చేస్తే ప్రత్యుత్తరం దాంట్లో నుంచే బయట కొస్తుంద"ని; అంచేత ఈ ఆటవెలది వేసిన అడుగుల్ని గుర్తించి, విన్యాసాన్ని పరికించి, భావాన్ని పట్టుకోవాలి. ముందుగా ఒక మనవి: నేనేదో పొడిచి గెలిచాననీ, మొనగాణ్ణనీ మీసం మెలి తిప్పటం లేదు; నాకు మీసాలు లేవుకూడ. "నే నేర్చిన భంగి వచించ" డానికి -నాకంటె పెద్దలైన పండిత కవి విమర్శకుల ముందు మోకరిల్లి అనుజ్ఞ వేడు కొంటున్నాను.

పైన చెప్పిన పద్యంలోని చివరి పాదమే వక్రోక్తి మయం. తెలుగులో పంచ కావ్యాలను వేరు పరచిన తీరు శ్రీశ్రీకి నచ్చలేదు. ఆ ఏంగడింపు సరసులు చేసింది కాదని ఆయన నిరసన.

ఆ పద్ధతిని ఎక్కిరించి, చక్కదిద్ది, స్థానభ్రంశం కల్పించి, తన అభీష్టం మేరకు వాటికి సముచిత స్థానాలు చూపించడం ఆ పద్యంలోని చమత్కారం. ఐదు, మూడు, రెండు అనే పదాలు వాడకుండా, వాటి స్థానంలో అంకెలు వాడటం గమనార్హం.

సైకోఎనాలిసిస్ సిగ్మండ్ ఫ్రాయిడ్ రాసిన మనోవైజ్ఞానిక గ్రంథమని అందరికీ తెలిసిందే. మరి "కాకి" ఎవరికి ప్రతీక? "ఆటవెలది ద్విపద కత్తగారు" అనడంలో శ్రీశ్రీ అభిప్రాయం స్పష్టమే. ఆయన పద్యవిద్య, లోతుపాతులు తెలిసిన వాడు కదా? ఆటవెలది శిక్షణలో ద్విపద తీరిందని తాత్పర్యం. దీన్లో సందేహించ దగిందేమీ లేదు. ఎటొచ్చీ చివరి పాదంలోనే పీటముడి పడిపోయింది; శ్రీశ్రీ భావం చిక్కు బడిపోయింది; ఆ చిక్కు తీర్చి కొప్పు పెట్టాలి. ఆముక్త మాల్యదను పట్టుకొంటే అతి కష్టం మీద చిక్కు విడిపోతుంది. "అతి కష్టం మీద" అని ఎందుకంటున్నా నంటే - శ్రీశ్రీ సహకారం, సహాయం లేకపోతే అది గూఢ గహనమే!

"అనంతం" శ్రీశ్రీ స్వీయ చరిత్ర; దీన్ని ఒక ప్రహేళిక అన్నాడాయన. దీన్లో ఎన్నో చిక్కులు విడిపోతా యన్నాడు కూడా. ఇందులోని గూఢార్థాలను గాలిస్తే రూఢార్థం బయట పడుతుందన్న మాట. "కవి సార్వభౌముడ"ంటే శ్రీశ్రీకి గౌరవాభిమానాలు మెండు. "షేక్స్పియర్ నాటకాలు రాస్తే, శ్రీనాథుడు మహా కావ్యాలు రాశాడు" అంటాడు శ్రీశ్రీ. అంతేకాదు; 'పెద్దన' పెద్దరికాన్ని ఆయన ససేమిరా అంగీకరించడు. సెట్టి నరసింహాంగారు మను చరిత్ర కంటె వసు చరిత్ర గొప్ప కావ్యం" అని చెప్పగా చూపు వసు చరిత్ర మీద నిలిచింది. హెచ్చు లొచ్చులు తెల్సుకొని 'సెట్టి' వారి మాట నిజమేనని దృఢ పరుచుకొన్నాడు.

ఎక్సాపొండ్" సెలక్టెడ్ పొయమ్సు"కు టి.యస్. ఇలియట్ రాసిన ఇంట్రొడక్షన్ లోంచి - "The poem which is absolutely

కొరవ 11 పేజీలో

పంచాంగమ్

గురుమౌఢ్యమి

తేది 6 సోమవారం నుండి గురు మౌఢ్యమి ప్రారంభము. శుభకార్యములు లేవు

జనవరి తిథులు

మార్గశిర బహుళ

తే 4 శని దశమి ప.గ. 4.10 వ
తే 5 ఆది ఏకాదశి ప.గ 4.15వ
తే 6 సోమ ద్వాదశి ప.గ. 3.30 వ
తే 7 మంగళ త్రయోదశి ప.గ. 2.22 వ
తే 8 బుధ చతుర్దశి ప.గ. 12.50 వ
తే 9 గురు అమావాస్య ప.గ. 11.00వ

మార్గశిర శుద్ధ

తే 10 శుక్ర పాడ్యమి ఉ.గ. 8.55 వ

స్వయంపాకుల శ్రీనివాసులు, ఎం.ఎ.,

మాటలతో ఆట – 35 సమాధానాలు

అడ్డం: 1.కవిమి 3.చాపం 5.తూపులు 7.రెమ్మ 8.గుట్టు 9.వరుణి 10.దబ్బ 11.తెలు 12.తీము 13.రంపము 15.క్షప 16.ఏక 19.అవి 20.వాడి 21.స్నేహము 23.బుక్కు 24.పాతక 25.రక్కు 26.నాటక 27.పరము 28. సిద్ధి 29.కేవలం 31.మచ్చిక 32.ఏడం 34.వాలుక 35.మొర 36.ఏలా 37.చెరగు 38.కొల్ల 39.ఆరాటం 40. పదద 41.కరి 42.గంగాళం 43.[illegible]ము 44.విఘ్న 45.6 నిలువు: 1.కమ్మ 2.మిగులు 4.పంతం 5.తూణీరం 6.ల[illegible]వము 7.రెక్క 11.తీప 12.తీక 14.పట్టం 15.క్రతి 16.ఏడిక 17.మోహరము 18.పెక్కురు 19.అత్రి 20. దాతకం 22.ముక్కు 24.పాటలం 26.నావలు 27.పచ్చిక 28.సితం 29.కేభరం 31.కులుగు 32.ఏక 33. కోలాటం 34.నారదబ్బ 35.మొల్ల 36.ఏ లాలం 37.చిదప 38.కొరివి 39.ఆగామి

సరియైన సమాధానాలు పంపినవారు: పి. రాధమ్మ, నెల్లూరు; వి. క్రిష్ణయ్య, కుద్రాము; ఎస్. కోటయ్య, నెల్లూరు; ఎస్.వి. లక్ష్మి, నెల్లూరు; ఎ. ఉపారాణి, నెల్లూరు; కె. రాఘవరావ్, నెల్లూరు; టి. వెంకటరమణయ్య, మాచర్లవారిపాలెం. విజేత: పి. రాధమ్మ, నెల్లూరు.

మాటలతో ఆట – 37



అడ్డం:

1. పరికిత యుద్ధం (2)
2. విశాఖ జిల్లాలో ఒక పట్టణం (2)
3. అనుకొంటే కాగునటో? (2)
4. వాయితో చేసే పని (2)
5. వావడం (2)
7. గొప్ప (2)
8. ప్రయాణమే (2)
9. వెనకాల గదిలో స్త్రీ (3)
10. ఇంటిలో చెదిబడి వస్తువు లుంచుకొనే నిర్మాణం (3)
11. హారం (2)
14. భూమి (2)
15. 7రోజుల్లో గుర్రం ఉంది (2)
17. మొదలవుతుంది. వెతకండి పాడి ఆవు దొరుకు తుంది (3)
18. బలం (2)
19. జాబిలిలో దయ (2)
20. మెడకు బిగుసు కొనేది (2)
21. అపరాధం (2)
22. బాగుకానిది (2)
23. అభ్రకం పొర (2)
24. అభయం (2)
25. రాత్రి (2)
26. నదికట్ట మీద సమర్థుడు (2)
28. తోరణం జలించండి అధికం (2)
29. రోషం వికృతి (2)
30. ఇంగ్లీషులో కైపు (2)
31. ఆడపిల్ల ఈడేరితే తిన్పించే ఆవిరిలో ఉడికించిన తీపి పిండివంట (2)
32. కనబడకుండా ఉంచు (2)
33. నేరు (2)
34. తుళ్లుకు అసమా[illegible] (2)
35. [illegible] సే మేలు తల్లి [illegible]య్యిదంటనే ? (2)
36. రాకపోకల్లో నిండు పున్నమి (2)
37. ప్రశంస (2)
38. శ్రమ; కష్టం (2)
40. నుయ్యికి వత్తు తీసేయ్ (2)
41. ఊరు (2)
42. సహాయం (2)
43. మద్యం (2)
44. నీటి గుండం (2)
45. ఉయ్యాలా జంపాల (2)
46. దేవత (3)
47. సుమంగళి మెడను అలంకరించేది (2)

నిలువు:

1. పెనుం మీద కాలేది ఏదైనా ఇదే (2)
2. ముక్క (3)
3. సంతోషం (3)
4. తోక (3)
5. దొంగ పశువుల మెడకు కాలికి కలిపి కట్టేది (2)
6. నగరిలో కొండ (2)
7. కుండ (3)
12. బంట్రోతు మెడ నుండి మోలదాకా తగిలించుకొనే[illegible] (3)
13. గడ్డికి జంట పదం; కసువే (3)
14. భోజనం (2)
15. సుగ్రీవుడి అన్న (2)
16. దొంగ (2)
17. పిల్లచెట్టు (3)
18. బాణం (2)
19. ఆలస్యం (2)
20. లవణం (2)
21. నేరమిలో చక్రం (2)
22. సహించు; (2)
23. పక్షుల మలం (2)
24. కంఠభూషణం (2)
25. 30దినాలు (2)
26. శరణం (2)
27. చాపుగా ఉండేరాయి (2)
28. ఉదయించి; బుద్ధికి తట్టు (2)
29. కసరోయిలో వేశ్యకిచ్చే సొమ్ము (2)
30. [illegible] తాంబూలం (2)
31. మార్గాలం (2)
32. ముస్లింల గడ్డం (2)
33. సెలయేరు (2)
34. ఇనుముకు పట్టే మురికి (2)
35. ఉరిసిలో ప్రోత్సాహం (2)
36. శిల (2)
37. కంఠం (2)
38. గాలి (3)
39. పిల్లంగోవి (3)
40. మాట (2)
41. వాగితే ఏరు (2)
42. చర్మం అంటే బండి నడపడమా ? (2)
43. కూతురు (2)

కీరవాణి హిందీ పేరు ఎంఎం క్రీమ్!

ఇదేదో కొత్తరకం ఐస్‌క్రీం అనుకునేరు – సంగీత దర్శకుడు కీరవాణి కొత్త పేరిది! హిందీ సినిమాలో ఆయనకొక ఛాన్స్ వచ్చింది. కొత్తగా వుంటుందని కొత్త పేరు పెట్టుకున్నారు. తమిళంలో ఆయన పేరు – మరకతమణి. పేరుపై ఏమి సెంటిమెంట్ వుందో పాపమాయనకు.

"సరదాల సంసారం"

సాయిప్రకాష్ దర్శకత్వం వహించే ఎనిమిదవ చిత్రం "సరదాల సంసారం". సురేష్, రుచిత, భాస్కర్, సంధన, గౌతంరాజు, వేణు, అరుణకుమార్, నరసింహరాజు, సమత పాత్రధారులు. మాటలు: దురికి మోహనరావు. సంగీతం: దుగ్గిరాల.

"చిరుకానుక"

అనంద్, రవళి, హరిత, ఆహుతి ప్రసాద్, బ్రహ్మానందం, బాబూమోహన్, అశోక్‌కుమార్, గౌతంరాజు, చిట్టిబాబు, శేఖర్‌రాజు నటించే "చిరుకానుక" చిత్రానికి మాటలు: నడిమింటి. సంగీతం: వందేమాతరం శ్రీనివాస్. దర్శకత్వం: సింగం సుధాకరరెడ్డి.

ఆలీ "అవారాగాడు"

"అల్లరి చిల్లరగా తిరిగే హీరో, ఒక చిలక చెప్పిన జోస్యం వల్ల ఎలా అదృష్టం కలిసొచ్చి, అందల మెక్కాడనే పాయింట్‌తో చిత్రం తయారవుతుంది." అన్నారు వేము. చిన్న పాయింట్‌తోనే పెద్ద సినిమా తీయొచ్చనే ఆత్మస్థయిర్యంతోఉన్న ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తయారయ్యే "అవారాగాడు" చిత్రంలో ఆలీ, కావ్య, ఎ.వి.ఎస్., బాబూమోహన్, తనికెళ్ళ భరణి, గుండు హనుమంతరావు, మల్లికార్జునరావు, సంగీత, సుధ, కృష్ణవేణి, పాకీజా, శాంతి పాత్రధారులు: సంగీతం: మాధవరెడ్డి సురేష్.

"అపరిచితుడు"

కొత్త డైరెక్టర్ శ్రీనివాస్‌ను తెలుగు సీమకు పరిచయం చేసే చిత్రం "అపరిచితుడు"; ఇందులో డాక్టర్ రాజశేఖర్ సరసన సాక్షి శివానంద్, మేఘన నాయికలు.

స్వగ్రామంలో పుట్టినరోజు

నటుడు వెంకటేష్ తన స్వగ్రామమైన కారంచేడులో ఈ యేడాది తనపుట్టిన రోజు జరుపుకున్నాడు. సురేష్ ప్రొడక్షన్స్ బేనర్‌పై కారంచేడులో నిర్మిస్తున్న చిత్రం వల్ల పుట్టినరోజు ప్లానింగ్ ఇక్కడే ఏర్పాటు చేసుకొని, గ్రామంలో నానా హంగామా సృష్టించాడు.



'చిన్నబ్బాయి' చిత్రంలో వెంకటేష్

గందరగోళం ఎవరిది?

"ఆలీ ద్విపాత్రాభినయంతో తయారవుతున్న చిత్రమిది. ఆలీ పత్రికా కార్యాలయంలో ఉద్యోగి. అతడ్ని ఆ పత్రికా ప్రచురణ కర్త కూతురు శ్రీశాంతి ప్రేమిస్తుంది. సామాన్య కుటుంబంలో సాదా సీదాగా బతుకుతున్న మరో ఆలీని శుభశ్రీ ప్రేమిస్తుంది. తమ ప్రియుళ్ళు ఒకే పోలికలో ఉండడం వల్ల గందరగోళంలో పడతారు. ప్రియురాళ్ళిద్దరూ," అన్నారు డైరెక్టర్ పి.వి.వి. సోమరాజు. పాత్రలు "గందరగోళం" చెందేమాట అటుంచితే, ప్రేక్షకులు గందరగోళం చెందకుండా ఉంటేచాలు. సూర్యదేవర రామమోహన్‌రాయ్ వ్రాసిన "సంభవం" అనే సీరియస్‌గా నడిచే నవలను వినోదాత్మక చిత్రంగా మలిచామని డైరెక్టర్ చెప్పడం ఎంతో హాస్యాస్పదంగా ఉంది.

కొత్త రకం టైటిల్

తమిళంలో తయారవుతున్న ఒక చిత్రం పేరు "మొదటి భార్యల సంఘం", తెలుగు డబ్బింగ్ నిర్మాతలను ఆకర్షించడానికే ఈ టైటిల్ పెట్టారట!

రామానాయుడు 100వ చిత్రంలో ప్రత్యేకతలు

స్టార్ ప్రొడ్యూసర్ రామానాయుడు సురేష్ ప్రొడక్షన్స్ బేనర్‌పై నిర్మిస్తున్న 100వచిత్రాన్ని ఘనంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి, వెంకటేష్ కలసి నటిస్తున్నారు. ఈ స్పెషాలిటీతోపాటు శివాజీగణేషన్ నటించడం మరో విశేషమని రామానాయుడు చెప్పారు.

ఎ.వి.ఎస్ దర్శకత్వంలో "సూపర్ పోలీస్"

అఖరికి హాస్య నటుడు ఎ.వి.ఎస్. కూడా దర్శకుల జాబితాలో చేరిపోయాడు. ఆ పుణ్యం కట్టుకున్నది సురేష్ ప్రొడక్షన్స్ డి. రామానాయుడు. వీరి "సూపర్ పోలీస్" చిత్రంలో బ్రహ్మానందం, ఎ.వి.ఎస్., హరీష్, సత్యనారాయణ, మురళీ మోహన్, తనికెళ్ళ భరణి, చలపతిరావు, అశోక్‌కుమార్, జె.వి. సోమయాజులు, గుండు హనుమంతరావు, లక్ష్మి పాత్రధారులు. సంభాషణలు: దివాకర్ బాబు. సంగీతం: మణిశర్మ.

కొరవ 12 పేజీలో

చుడీదార్‌తో కమల్ స్త్రీ వేషం

తన తమిళ చిత్రాలను హిందీలో పునర్నిర్మించడానికి కమల హాసన్ సన్నాహాలు చేస్తున్నారు. "భామనే - సత్యభామనే" హిందీ చిత్రంలో హీనా పాత్రను జాహిదాఖ్న ధరిస్తుంది. ఇంకా శత్రుఘ్నసిన్హా పంకజ్ కపూర్, అమ్రేష్‌పూరి ఉంటారు. "నేను స్త్రీ వేషంలో చీరకట్టుకోక చుడీదార్‌తో కనిపిస్తాను," అన్నారు కమల్.

నిద్రిస్తున్న వారిని మేల్కొలిపే కళకు ప్రతిరూపం

దళం

"నిద్ర పోతున్నవారు కనేది కల, నిద్రిస్తున్న వారిని మేల్కొలిపేది కళ" - అన్నది, ప్రముఖ చిత్ర నిర్మాత, దర్శకుడు, కథకుడు అయిన ఆర్. నారాయణ మూర్తి ఖచ్చితమైన అభిప్రాయం. వ్యాపారాత్మక చిత్రాల వెల్లువకు తట్టుకుంటూ సమాజ శ్రేయస్సు కోసం అభ్యుదయం, మానవత్వం నిండిన దండోరా, ఎర్రసైన్యం, చీమలదండు వంటి విప్లవ చిత్రాలు నిర్మించి జనావళిలో ప్రభంజనం సృష్టించాడు. ఆయన సొంత కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంతో తాజాగా "దళం" చిత్రం నిర్మితమైంది. దేశానికి అన్నం పెట్టే రైతన్నపై జరిగే దోపిడీ ఈ చిత్ర కథాంశం.

రైతు సమస్య కొత్తది కాకపోయినా, సమస్య క్రూర స్వరూపాన్ని చూపిన విధానంలో కొత్త దనం కనిపిస్తుంది. దర్శకుడు ఆర్.నారాయణ మూర్తి కథనాన్ని చురుకైన మెలుకువలతో, కరుకైన సెంటిమెంట్సుతో, నూతన పంథాలో నడిపించాడు. ప్రతి అంశానికీ మెరుగులు దిద్ది చిత్రానికి పటుత్వం కూర్చాడు.

పి.ఎల్. నారాయణ వ్రాసిన మాటలు కూడా చిత్రానికి మంచి ఊపు అందించాయి. గూడా అంజయ్య, సుద్దాల అశోక్ తేజ, మండే సత్యం, భాసూరి వ్రాసిన పాటలు అర్థవంతంగా, సన్నివేశ పరంగా కుదిరి చిత్రం నడకకు బలం చేకూర్చాయి. ఎస్పీ పాడిన, "దళం" టైటిల్‌పాట ఉద్వేగంగా సాగుతుంది. "ఇక ఎగబడదాం తలబడదాం" "పల్లెకే మా పల్లెకొచ్చిన వీరులెవ్వరే" "దండమే అత్తవ్వ నీకుదండమే" - వంటి విప్లవాత్మకమైన పాటలు ఈ చిత్రంలో ఎనిమిదున్నాయి. జాన పదాల ప్రయోగాలతో కూర్చిన ఈ పాటలకు సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ జానపద బాణీలను ధ్వనింప జేశాడు. జి. చిరంజీవి తన కెమరాతో ఆయా పాటల దృశ్యాలను గొప్పగా చిత్రీకరించాడు. వెంకన్న భార్య మరణం తర్వాత రూపొందించిన పాట దృశ్యం తలమానికం.

ఈ చిత్రంలోని పాటల రచయితలు, చాలా వరకు నటీనటులు కొత్త వారే. వీరందరి ప్రతిభను దర్శకుడు అద్భుతంగా ప్రదర్శింప జేశాడు. దర్శకుడు నారాయణ మూర్తి విప్లవ కథానాయకుడు కాబట్టి ఈ చిత్రంలోనూ విప్లవ శక్తియైన వెంకన్న పాత్రను సమర్థవంతమైన నటనతో మంచికి ప్రతీకగా తీర్చాడు.

చిత్రసమీక్ష
గిద్దలూరు గోపాలరావు

వెంకన్న భూస్వామి భూషయ్య వద్ద పాలేరుగా వుంటాడు. మంచివాడు, విశ్వాస పాత్రుడు, కండబలం, మాట విలువ కలవాడు. వెంకన్న విశ్వాసాన్ని అసరాగా తీసుకొని భూషయ్య అతని శ్రమను దోచుకుంటూ వుంటాడు. తన మాట విలువతో ఆ ఊళ్ళోని బడుగు వర్గాన్ని ఒకతాటి మీద నడప గలిగిన వెంకన్న, కాస్త ఆలస్యంగా భూషయ్య మోసాన్ని తెలుసుకొని, అతనిమీద తిరుగుబాటు చేస్తాడు. వెంకన్న కూతుళ్ళను, భార్యను భూషయ్య చంపిస్తాడు. వెంకన్న ఉగ్రవాదులతో కలసి దండుకడతాడు. దళపతిగా దళం నడుపుతాడు. రైతన్న హక్కులు సాధిస్తాడు. శృంగారాన్ని

పచ్చి శృంగారాన్ని, పనికి మాలిన ఫైటింగులను అదేపనిగా ఆరాధించే నిర్మాతలు, దర్శకులు, ప్రముఖ హీరోలు చెప్పి ఆర్. నారాయణ మూర్తి సామాజిక స్పృహ నుంచి ఒక్క పిసరంత నేర్చుకో గల్గితే, తెలుగు సీమ బాగుపడి పోతుంది.

ఎస్వీని హీరోగా మార్చారు!

క్రేజీ యువ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి హీరోగా మనీషా సంస్థ నిర్మించే చిత్రం షూటింగ్ మార్చిలో ప్రారంభం కాబోతుంది. హీరోకు కావల్సిన లక్షణాలన్నీ ఎస్వీకి ఉన్నాయని; సకుటుంబ సమేతంగా చూసే విధంగా ఈ చిత్రం ఉంటుందని నిర్మాత అచ్చిరెడ్డి చెప్పారు.

PHILIPS
అద్భుతమైన ఆఫర్

ఆథరైజ్డ్ షోరూం:
Ph: 23446
S.S. పాయింట్
రమాకాంత్ లాడ్జి ఎదురుగా, ట్రంకు రోడ్, నెల్లూరు - 1

జనవాణి

3 పేజీ తరువాయి

లందరినీ తిరిగి పార్టీలోనికి తీసుకొస్తున్నారు. ఈ దశలో పార్టీకి అనుభవమున్న నాయకుని సారథ్యం కావాలి. ఫైలెట్ వంటి దుందుడుకు స్వభావి పనికిరాదు.

నెల్లూరు షేక్. గౌస్‌మొహిద్దీన్

నెల్లూరు కార్పొరేషన్ ఉత్తర్వు ఎప్పుడొస్తుంది?

రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి తమ్మినేని సీతారాం నెల్లూరు మునిసిపాలిటిని కార్పొరేషన్‌గా రాష్ట్ర ప్రభుత్వం వద్ద నెల్లూరు కార్పొరేషన్ ప్రతిపాదన మినహా మరొకటి లేదన్నారాయన. కార్పొరేషన్ చేస్తే నెల్లూరుకు మరికొన్ని అదనపు నిధులొచ్చి అభివృద్ధి చెందే అవకాశం వుంది. ఈ ఉత్తర్వులు తొందరగా తెచ్చే విషయంలో కొత్త మంత్రులు శ్రద్ధ వహించాలి.

విశాఖపట్నం డాక్టర్ వి.గిరికుమార్

గీతా పారాయణం

టర్కీదేశ మాజీ ప్రధాన మంత్రి బులెంట్ ఎసీవిట్ తన మనస్సు ఆందోళనకు, సంక్షోభానికి గురైనప్పుడు భగవద్గీతను పారాయణ చేస్తారట. అపుడు తన మనసెంతో కుదుటపడి నిర్మల మవుతుందని చెప్పారాయన. రాజకీయాల్లో మునిగి తేలుతున్నప్పుడు కూడా భగవద్గీత తనకు సరియైన స్ఫూర్తిని కలిగించి, ఆలంబనగా ఉండేదని పెక్కు అంతర్జాతీయ వేదికలపై ఎసీవిట్ వివరించారు. పాలస్తీనా నాయకుడు ఆరాఫత్ కూడా తాను భగద్గీత చదివి పలుసార్లు మనస్సు మార్చు కున్నట్లుగా పత్రికల్లో వార్తలొచ్చాయి. ఏ మతం వారికైనా భగవద్గీత పారాయణం వల్ల ఎంతో ఆనందం కలుగు తుంది. సరియైన మార్గంలో నడిచేందుకు స్ఫూర్తిగా నిలుస్తుంది.

మార్కాపురం వి.రామారావు

షేర్ కాలం బాగుంది

జమీన్‌రైతులో డాక్టర్ దుర్గాప్రసాద్ వ్రాస్తున్న షేర్ కాలం బాగుంది. షేర్ల వ్యామోహం నుండి బయట పడలేక మధన పడుతున్న అభాగ్య సోదరులకు అమూల్య సలహాలిస్తూ మేల్కొలుపు తున్నారాయన. చక్కని విషయ పరిజ్ఞానంతో ఆయన వ్రాస్తున్న వ్యాసాలు ఆలోచింప జేస్తున్నాయి. డాక్టర్ గారు నవంబరు సంచికల్లో రెడ్డీస్ లాబొరేటరీస్ నెల్లూరీయుడు స్థాపించినట్లు వ్రాశారు. కాని దీన్ని గుంటూరుకు చెందిన అంజిరెడ్డి స్థాపించారు. ఆయన కుమార్తెను నెల్లూరీయులు శ్రీ గునుపాటి ప్రసాదరెడ్డి వివాహమాడి రెడ్డీస్ ల్యాబ్ అనుబంధ సంస్థ అయిన 'కెమినార్ డ్రగ్'కు ఎం.డి.గా వ్యవహరిస్తున్నారు.

హైదరాబాదు డి.జనార్దనరెడ్డి

జానపదుల జావళీలు

డిసెంబరు 20తేది జమీన్‌రైతు సంచిక రాయి - తురాయి శీర్షికలోని 'జానపదుల జావళీలు' చదివిన తరువాత నాలోని భావాలను వ్రాయాలని పించింది. చక్రోలి ఫలము చేప్పనైనను నదు గాక మావిఫలము కనరు టినము నొక్కొకపు చూపి యుండిన నుండుగా కెందు సత్కవిత్వ యెలమినొసగు - అని 'వాసింగన్న పర్వ' కర్త అన్నట్లు వేయి దిరిగిన రచయితల కలం నుంచి జాలు వారిన ఏరచనయైనా చదువరులను ఆలోచనపు అంచుల్లోకి తీసుకెళ్తుంది. అగ్నిమిత్ర జానపద సాహిత్య విమర్శనా వ్యాసం ఉషఃకాలంలో భూపాల రాగ ఆలాపన విన్న ఆనందాను భూతుల్ని కల్గించింది. ఏది ఏమైనా జానపద కవులు పాత్ర స్మరణీయులే కాదు. చిరస్మరణీయులు.

నెల్లూరు రేవూరు హనుమంతరావు

పోస్టల్ పనితనం

నేను గత 34 సంవత్సరాలుగా జమీన్‌రైతు చందాదారునిగా ఉంటున్నాను. దూర ప్రాంతంలోఉన్నా శనివారమే పత్రిక అందేది. కాని గత కొన్ని నెలలుగా పత్రిక సరియైన సమయంలో చేరడం లేదు. ఆగస్టు 30 తేది సంచిక సెప్టెంబరు 21తేది, సెప్టెంబరు 20తేది సంచిక 28తేది, అక్టోబర్ 4తేది సంచిక 30తేదీ, అక్టోబర్ 11తేది సంచిక డిసెంబరు 13తేది వచ్చింది. పోస్టల్ శాఖ ఇంత నత్తనడక ఎందుకు నడుస్తున్నదో అర్థం కావడం లేదు.

కొచ్చిన్ ఎన్. రామచంద్రారెడ్డి

స్పెషల్ జమీన్‌రైతు ఆకట్టు కొనేలా ఉంది

నెలకొకటిగా విడుదల చేస్తున్న జమీన్‌రైతు జిల్లా ప్రత్యేక సంచిక ఆకర్షణీయంగా ఉంది. వ్రాసిన వార్తలన్నీ యదార్థాలు. శైలి నెల్లూరీయులు మాట్లాడు కొన్నట్లుంది. దీనిలో ప్రచురితమైన వార్తల వల్ల వివిధ శాఖాధికారుల పనితీరులో కాసింత మార్పు వస్తే అంతే చాలు. 'జమీన్‌రైతు' గూర్చి ఇంతకు ముందు విన్నానేగాని; కొత్త సంచిక ద్వారా పత్రిక స్థాయి తెలుసుకో గలిగాను.

నెల్లూరు పి. కోటేశ్వరరావు

కాంగ్రెస్ వాళ్లు సంస్కారం నేర్చుకోవాలి

కాంగ్రెస్ పార్టీలో సంస్కార మనేది దివిటీ పెట్టి వెతికినా కనపడేట్లు లేదు. పివి నరసింహా రావును పార్లమెంటరీ నేతగా తొలగించిన వైనంలో ఈ విషయం మరింతగా ద్యోతక మయ్యింది. పివి నరసింహా రావు తాను రాజకీయాలు చేపట్టింది మొదలు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగు తున్నారు. ఎప్పుడూ కప్పు గంతులు వేయలేదు. కేంద్ర మంత్రి హోదాలో అవినీతికి పాల్పడినట్లు రుజావులు లేవు. ప్రధాని అయ్యాక తన ప్రమేయం లేకుండానే పలుకేసుల్లో చిక్కుక పోవడం ఆయన దురదృష్టం. మౌనిలా ఉండటం కూడా పివి పాలిటి శాప మయ్యింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా సీతారాం కేసరిని, పివి నియమించి నప్పుడు, కేసరి ఆయనకు సాష్టాంగ ప్రమాణం చేసారు. కొద్దిగా నిలదొక్కు కొన్నాక నరసింహా రావును అమర్యాద కరంగా పార్లమెంటరీ నేతగా కొన్ని గంటల్లో దిగి పొమ్మని అల్టిమేటమ్ ఇచ్చారు. ఏళ్ల తరబడి పార్టీలో వున్న ఒక అగ్ర నాయకుడ్ని ఈ విధంగా అవమాన కరమైన రీతిలో సాగనంపడం ఆ పార్టీకి తీరని కళంకం.

నెల్లూరు ఎస్ నరసింహా చార్యులు

వారఫలాలు

4.1.97 నుండి 10.1.97 వరకు మీనంలో శని కేతువులు; కన్యలో కుజ రాహువులు; వృశ్చికములో 4వరకు శుక్రుడు; 5నుండి ధనుస్సులో శుక్రుడు మరియు రవి, బుధులు; మకరంలో గురుడు; తుల, వృశ్చిక, ధనుర్మకరములలో చంద్రుడు.

మేషం

(అశ్వని, భరణి, కృత్తిక 1పాదం)

కార్యశ్రమ, అకాల భోజనము, వ్యక్తులను గురించిన ఆందోళన కుటుంబ సభ్యుల అనారోగ్యం గూర్చిన చింత వార ప్రథమార్థంలో ఉంటుంది. ఆదాయం బాగున్ననూ ఖర్చులు కూడా అంతే ఏర్పడగలవు. దుశ్చింతన దుష్కార్యములు చేసి బాధపడతారు. స్పెక్యులేషన్లు, వ్యాపార విస్తరణలకు అంతగా అనుకూలత యుండదు. పనులను వాయిదావేసి కొనడం మంచిది.



వృషభం

(కృత్తిక 2,3,4, పాదాలు; రోహిణి, మృగశిర 1,2పాదాలు)

అన్ని జీవన రంగాల వారికి ఆదాయం బాగుంటుంది. పెద్దలు అధికారుల సహకారంతో పనులు సాధిస్తారు. కుటుంబ సౌఖ్యం మంచి వార్తలు వింటారు. వారం చివర వస్తు వాహన నష్టం బంధు విభేదాలు వసూళ్ళు. వృత్తి వ్యాపారము విస్తరణ బాకీ వసూళ్ళకు మంచి సమయం. అనవసర వ్యాపకాలలో చొరవ చూపవద్దు.

మిధునం

(మృగశిర 3,4పాదాలు; ఆర్ద్ర; పునర్వసు 1,2,3పాదాలు)

ఉద్యోగ వృత్తి వ్యాపార జీవనం కలవారికి ఆదాయం బాగుంటుంది. కుటుంబంలో కలతలున్నా, సంఘంలో గౌరవం బాగుంటుంది. పనులు నిదానంగా జరిగి ఆందోళన కలిగించగలవు. పాత బాకీలు కొంత వరకు వసూలు కాగలవు. వారాంతంలో కుటుంబ సభ్యుల అనారోగ్యం, తొందరపాటు ప్రవర్తన వల్ల తగాదాలు కలుగ గలవు. వస్తు నష్టం కలుగుతుంది.



కర్కాటకం

(పునర్వసు 4వ పాదం; పుష్య; ఆశ్రేషలు)

అధికారికమైన పనులు ఆలస్యంగా సాగటం, అనవసర పనులు చేయవలసి రావటం. ఆరోగ్య లోపం ఈ వారంలో దోషాలు. అన్ని రంగాల వారికి ఆదాయం బాగుంటుంది శుభవార్తలు వినడం, దూర ప్రయాణాలు, బిడ్డలకు సంబంధించిన పనులు చూచుకొనడం జరుగు తుంది. బంధువుల రాకపోకలు బాగుంటాయి. ఆస్తి పరమగు నిర్ణయాల పరిశీలన చేస్తారు.

సింహం

(మఖ; పుబ్బ; ఉత్తర 1వపాదం)

వ్యాపార వృత్తి జీవనం కలవారికి ఆదాయం బాగుంటుంది. బిడ్డల వల్ల బంధువుల వల్ల ఖర్చులు పెరగ గలవు. ఉద్యోగ శ్రమ ఇతరులతో తగాదా లుండగలవు. ఆర్థిక వత్తిడిని ఎదుర్కొన వలసి ఉంటుంది. శిరస్సంబంధిత రుగ్మతలతో బాధపడటం, అప్రియ వార్తలు వినడం జరుగుతుంది. ముఖ్యమైన వారివల్ల మోసగించ బడవచ్చు.

కన్య

(ఉత్తర 2,3,4 పాదాలు; హస్త; చిత్త 1,2పాదాలు)

ఈ రాశి వారికి ఆదాయం, కార్యానుకూలత బాగుంటాయి. కాని తీసికొనే నిర్ణయాలు రాబోవు రోజులలో చిక్కులను కలిగించ వచ్చు. పలుకుబడి గౌరవం బాగుంటాయి. సాంస్కృతిక కార్యాలలో పాల్గొనటం, ఇతరులకు సహాయ పడటం చేస్తారు. వారాంతంలో స్వల్ప అనారోగ్యం కలుగ వచ్చు. బిడ్డలకు సంబంధించిన శుభవార్తలు వింటారు.

స్వయంపాకుల శ్రీనివాసులు, ఎం.ఎ.

తుల

(చిత్త 3,4 పాదాలు; స్వాతి; విశాఖ 1,2,3 పాదాలు)

వృత్తి వ్యాపార జీవనం కలవారికి ఆదాయంతో పాటు, నూతన వ్యాపార ప్రయత్నాలు కలసి వస్తాయి. ఉద్యోగులకు సామాన్య ఆదాయం. ఉద్యోగ చిక్కులలో చిక్కుకొనే ప్రమాదముంది. కుటుంబ వ్యక్తుల ఆరోగ్య లోప సమస్యలు బాధిస్తాయి. ఆస్తి సమస్యలు, వివాహ ప్రయత్నాలు అనుకూల ఫలిత మివ్వవు. మీ పలుకుబడి ఉపయోగ పడదు. తగాదాలు పెట్టుకొన వద్దు.

వృశ్చికం

(విశాఖ 4పాదం ; అనూరాధ; జ్యేష్ఠ)

పట్టుదలతో పనులు సాధించు కొనడం, తెలివితేటలతో చిక్కులను తొలగించు కొనడం జరుగుతుంది. ఈ రాశి వారికి ఆర్థికంగా రాబడి బాగుంటుంది. బిడ్డల విషయమైన ప్రయత్నాలు మంచి ఫలితాన్నివ్వక పోవచ్చు. బాకీలు కొంత వసూలు కాగలవు. పలుకుబడి గౌరవం బాగుంటాయి. వారాంతంలో తొందరపాటు నిర్ణయాలు చేయవలసి వస్తుంది జాగ్రత్తగా వ్యవహరించాలి. వస్తు సంపద బాగుంటుంది.

ధనుస్సు

(మూల; పూర్వాషాఢ; ఉత్తరాషాఢ 1వపాదం)

ఈ రాశి వారికి ఆర్థికంగా బాగుంటుంది. ఆస్తుల కొనుగోలు వ్యాపార పెట్టుబడి ప్రయత్నాలు చేయవచ్చును. పనులు సాధించు కొనడానికి బాగా ఖర్చు చేస్తారు. అనవసర ప్రయాణాలు, స్వల్ప అనారోగ్యం వారాంతంలో వుంటాయి. సేవా కళా కార్యక్రమాలలో పాల్గొంటారు. యజమానులు, అధికారులు కొందరి వలన వ్యతిరేకతను ఎదుర్కొన వలసి వస్తుంది.

మకరం

(ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు; శ్రవణం: ధనిష్ఠ 1,2పాదాలు)

వృత్తి వ్యాపార వ్యవసాయ జీవనం కలవారు ఆశించిన ఫలితం పొందలేరు. ప్రయత్నించే పనులలో వ్యతిరేకత ఎదురౌతుంది. ఆర్థిక వత్తిడులు పెరగగలవు. అన్ని రకాల సమస్యలు చుట్టు ముట్టుతాయి. కాని మనోధైర్యం బాగుంటుంది. వస్తు నష్టం కలుగు తుంది. శ్రమ మిగులు తుంది ఫలితముండదు.

కుంభం

(ధనిష్ఠ 3,4పాదాలు; శతభిష; పూర్వాభాద్ర 1,2,3 పాదాలు)

వృత్తి వ్యాపార ఉద్యోగ జీవనం కలవారికి ఆదాయంతో పాటు ఖర్చులు సమానంగా వుండగలవు. బంధువుల అధికారుల రాకపోకలు, కార్యాను కూలత బాగుంటాయి. కుటుంబ ఉద్యోగ సమస్యలతో రాజీ పడవలసి వచ్చును. భుక్తి ద్వితీయార్థమున ఆరోగ్య లోపంలో, శుభ కార్య ప్రయత్నాలు జరుగ గలవు.



మీనం

(పూర్వాభాద్ర 4వపాదం; ఉత్తరాభాద్ర; రేవతి)

పనులు నిదానంగా జరగడం, ఆశించిన ఫలితం పొందలేక పోవడం, కుటుంబ సభ్యుల అనారోగ్యం ఈ రాశివారికి బాధలు. వృత్తి వ్యాపార ఉద్యోగ జీవనులకు సామాన్య ఆదాయం; పనుల వల్ల శ్రమ, ఇతర కార్యక్రమాలలో పాల్గొనడం జరుగు తుంది. క్రొత్త పెట్టుబడులు లాభించవు. చేతికందిన డబ్బును దాచుకొనలేని అశక్తత ఉంటుంది.

యువకునికి డిసిసి అధ్యక్ష పదవి ఇవ్వాలి

డిశంబరు 13 తేది జమీన్ రైతు సంచికలో డిసిసి అధ్యక్షులు ఆనం సంజీవ రెడ్డి చేసిన తుఫాన్ నిధుల దుర్వినియోగాన్ని చక్కగా వ్రాసారు. ఈ మహానుభావుని అవినీతి గూర్చి జిల్లా ప్రజలందరికీ తెలుసు. 25 సంవత్సరాల క్రితం సివిల్ సప్లయిస్ మంత్రిగా ఉన్నప్పుడు కేరళ రాష్ట్రానికి నూకల పేరుతో బియ్యాన్ని ఎగుమతి చేశారు. కోట్లాది రూపాయలు స్వాహా చేసి జిల్లాకు చెడ్డ పేరు తెచ్చిపెట్టి, మంత్రి పదవిని ఊడగొట్టించు కొన్నారు. ఆయనలో ఏనాడూ ప్రేమ, వాత్సల్యం, అభిమానం, సేవా సుగుణాలు మచ్చుకైనా కానరావు. ఎల్లప్పుడు ధనవంతులతో సహచర్యం తప్ప, మధ్య తరగతి ప్రజల పొత్తు అసలే పనికిరాదు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇటువంటి వ్యక్తికివ్వడం పార్టీ చేసిన పెద్ద పొరపాటు. జిల్లా కాంగ్రెస్ కార్యవర్గపు పదవు లన్నింటినీ రేటు పెట్టి అమ్ముకొన్న గొప్ప వ్యక్తి. ఇందిరా భవన్‌లో అప్పుడప్పుడు ప్రెస్ మీటింగులు పెట్టి పేపర్లలో కనపడడం మినహా పార్టీ అభివృద్ధి కోసం చేసింది శూన్యం. ఇకనైనా డిసిసి అధ్యక్ష పదవిని ఎవరైనా యువకుడికి అప్పగిస్తే పార్టీ పేరు నిలబడుతుంది.

నెల్లూరు కెవి నారాయణరావు

రొమాన్స్ విత్ రాజమండ్రి!

" కొన్ని జ్ఞాపకాలు జీవితాంతం వెంటాడు తూనే ఉంటాయి. ఆ నగరాన్ని, అక్కడి నదిని గూర్చిన జ్ఞాపకాలు నన్ను వెంటాడుతూనే వుంటాయి. రాజమహేంద్ర వరంలో నేనున్న కాలంలో నాలో చెలరేగిన భావజాలం అటు తర్వాత కూడా ఆ నదీ నగరంను నాలో ఉదిలించిన స్వర సమూహం అక్షర ప్రవాహమై ఈ కవితగా రూపు దిద్దుకొంది" అన్నారు కవిగారు 'వెంటాడే వెన్నెల' పేరుతో ఈ కావ్యానికి సమకూర్చిన పీఠికలో!

స్థల జ్ఞాపకాలు కలిగించే భావోద్రేకాన్ని ఆంగ్లంలో 'నోస్టాల్జియా' (Nostalgia) అంటారు. ఇదొక అనిర్వచనీయమైన అభివ్యక్తికి అందని విషాద మధుర అనుభూతి! దీనిని కవితా రూపంలో ఆవిష్కరించడ మంటే కత్తిమీద సాము వంటిదే! ఆర్వీయస్ సుందరంగారు ఈ ప్రయత్నంలో సఫలీకృతు లయ్యారని చెప్పవచ్చును.

ఈ సంపుటిలోని ఇరవై కవితలలో రాజమండ్రికి అంకితమైనవి సగానికి పైగా వున్నాయి - రాజమహేంద్ర వరాన్ని వర్ణిస్తూ కవి ఇలా అంటారు.

'నిజంగా అది విచిత్ర నగరమే
ఇప్పటికీ నన్నయ్యగారు
రాజమండ్రి పురవీధుల్లో
దర్శన మిస్తూనే వుంటారు
ఏ ప్రాచ్య కళాశాలవైపో
సైకిల్ మీద వెళ్తుంటారు
లేదా ఎర్రటి శాలువా కప్పుకొని
రిక్షాలోనో ఆటో రిక్షాలోనో కూర్చొని
వుంటారు'

నన్నయ్య వారసత్వం ఇంకా అక్కడ కొనసాగు తున్నదనే విషయాన్ని కవి యిలా చమత్కరించారు. అయితే రాజమండ్రిది వెనక చూపుకాదు. ముందు చూపే!

వెనక్కి పోతున్నట్లు కనిపిస్తూ
ముందుకు పోవటమొక చమత్కారం
గోదావరి గోదావరిగానే వుంటూ
ప్రవహించటం ఒక సంగీతం'

అంటూ రాజమండ్రి నిజ స్వభావం విశ్లేషించారు.

' ఆ ఊరు ఎలా ఉంది?' అనే కవిత కవిగారి రాజమండ్రి వియోగాన్ని వర్ణిస్తుంది. ఇది సాదాసీదా ఉత్తరం స్థాయిలో సాగింది. స్నేహంలోని మధుర స్మృతులతోబాటు వైరంలోని అపశృతులు కూడా ఇందులో చోటు చేసుకున్నాయి.

"నేనున్నప్పటి కంటె ఇప్పుడు
వార్తలు తగ్గాయను కుంటాను
ఆకాశం ఉత్తరాల్ని
వర్ణించటం లేదను కొంటాను
పాపం! రామన్నకింకేం తోస్తుంది?"

అన్నారు ఈ కవితల్లో 'ఆకాశ రామన్న ఉత్తరాలు' అవి కవి గుండెల్లో చేసిన గాయాల ప్రస్తావన ఒకటి రెండు చోట్ల వుంది. ఇది పూర్తిగా వైయక్తికం! ఇటువంటి 'ఆత్మకథాత్మక' సంఘటనలు పాఠకులను లేనిపోని జిజ్ఞాసలకు గురి చేస్తాయి. వీటిని పరిహరించి వుండ వలసింది. అలాగే కావ్యం పేరుతో ఇతి వృత్తంతో ఏ మాత్రం సంబంధంలేని కొన్ని కవితలను యిందులో చేర్చడం అసంబద్ధం అనిపిస్తుంది.

పఠాభి 'ఫిడేల రాగాల డజన్'తో ప్రారంభమైన నగర జీవిత చరిత్ర అద్దుర్ర 'సినీవాలి'తో పరాకాష్ఠకు చేరుకొంది.

అయితే ఆనాటి నగరాల పరిస్థితులు వేరు; నేటి నగరాల సమస్యలు వేరు! అన్ని సమస్యలను కాకపోయినా నగరాలలోని 'చెత్త' కాలుష్యాన్ని, మతకాలుష్యాన్ని కవి ప్రతిభా వంతంగా చిత్రించారు- ఉదాహరణకు -

'నగరం పెరుగుతూనే వుంటుంది' అనే కవితలోని కొన్ని పంక్తులు పరికించండి!

"పశువులు పేడవెయ్యటానికి
మనుషులు పెంటవెయ్యటానికి
అనువైన నగరంలో
వీధులు తలుపుల్లేని బహిర్భూములు
నగరం చెత్త కదలాలంటే
వర్షమైనా రావాలి, వరదైనా రావాలి"
....
నగరం ఒంటినిండా సిమెంటే...
కాంక్రీటు రాజ్యంలో కాంట్రాక్టర్లే
భూపతులు
మట్టి కాంక్రీటుకు దాస్యం చేస్తోంది"

'నగరం నడి బొడ్డున బొమ్మలాట' అనే ఖండిక మత కలహాలపై కవి ఆవేదన వెల్లడిస్తుంది. బాబ్రీ మసీదు విధ్వంసంపై ఒక ప్రత్యేక కవిత యిందులో వుండటం ఒక విశేషం!

ఆధునిక కవిత 'మూగ చెవిటి వారి ముచ్చట' అనే అపప్రథకు అపవాదంగా వుందీరచన. స్పష్టత, ఆర్ద్రత ఈ కవితకు పెట్టని ఆభరణాలు. ఎలాంటి సిమిలీలు, మెటఫర్లు లేకుండా కవికి, పాఠకుడికి మధ్య ఎలాంటి అడ్డు గోడలు లేకుండా ఈ కావ్యం ఏకబిగిన మనల్ని చదివింప చేస్తుంది.

***

> **గ్రంథ సమీక్ష**
>
> కావ్యం
> **నది - నగరం**
>
> కవి
> **డాక్టర్ ఆర్వీయస్. సుందరం**
> సమీక్షకుడు
> **తిరుమూరు సుధాకరరెడ్డి**
> వెల: 20/-
> ప్రాప్తిస్థానం: చింతల పద్మావతి హోంలైబ్రరీ, 76-5-16, గాంధీపురం-2 రాజమండ్రి - 533 103.

పాయసం పద్యాలు

బెగొరె

అతనా తొంభై రెండేళ్ళ వయసు వాడు
పుస్తకాల సరస్సుల్లో అక్షర స్నానం
చేస్తాడు
అంగవల సరస్సుల్లో స్వప్న సంగీతం
వినిపిస్తాడు
పినాకినీ పురమందిర ప్రవాహమై
కనిపిస్తాడు!

అతనా తొంభై రెండేళ్ళ వయసు వాడు
అలసట లేనివాడు, అరమర లేనివాడు
పిలిస్తే పలుకుతాడు, కవిత్వం
చిలుకుతాడు
నెల్లూరు గురజాడ, నెరజాణ
బెజవాడ!

న్యూయియర్!

సంసారం భారం, బ్రతుకేమో నేరం
కుంపటిగా కులం, మారణమై మతం
రౌడీల రాజ్యం, దారిద్ర్యం భూతం
ఎలా నిన్ను, స్వాగతించను నేస్తం?

గ్రీటింగ్స్

రంగురంగుల గ్రీటింగులు ఎన్నెన్ని
ప్రకృతిలో పూసిన పువ్వులు ఇవన్నీ
స్నేహంగా పలకరింపులు ఇయర్
కొకసారి!
జ్ఞాపకాల దొంతరలో ఓ నిముషం
స్వారీ!!

పంపిన అందరికీ గ్రీటింగ్స్-
హృదయ పూర్వకంగా, కంగ్రాట్స్!
అంతంత ధరపెట్టి ఎందుకు
కామ్రేడ్స్
కార్డు ముక్కరాస్తే పోలా మైడియర్స్!!

మనుషుల్లో స్వార్థాలు, మానవతకు
తైళ్ళు
స్త్రీ జాతికి పంజరాలు, బాల్యానికి
సంకెళ్ళు
అవినీతి కంపు, రాజకీయం రంకు
ఎలానిన్ను, స్వాగతించను మిత్రం?

రాయి తురాయి

8వ పేజీ కొరవ

ఎప్పుడూ అనుకరణ ప్రధానంగానే ఉంటుంది. అందుకే నా దృష్టిలో original is absolutely bad. True originality needs development." అనే వాక్యాలను ఉద్ధరించి, "రెండో రకం కవిత్వం మనుచరిత్ర రెండో రకం కవిత్వానికి గొప్ప ప్రతినిధి. వసు చరిత్ర మొదటి రకం. అయినా ఈ సూక్ష్మ రహస్యం చాలా మందికి బోధపడదు." అని విస్పష్టంగా చెప్పాడు. ఇంకా, "అల్లసాని పెద్దన శ్రీనాథుని పోకడల నెన్నింటినో తస్కరించా"డంటూ తాను తెరవాటుకాడై ఉండి కూడా కుకవి నిందలో తన వంటి "గ్రంథచోరులను తిట్టి పొయ్యడం" గురువింద లక్షణం అని పెద్దనకు వేసిన పెద్దపీటను లాగి పారేశాడు.

ఇకపోతే - ప్రబంధ కవులందరిలోనూ శ్రీశ్రీ మెచ్చింది తెనాలి రామకృష్ణ కవిని; అగ్రతాంబూలం పాండురంగ మహాత్మ్యానిదే. సిప్రాలిలో " ఇష్టదేవతా ప్రార్థనలో రామకృష్ణ కవిపై కురిపించిన ప్రశంసల జడిని చూడండి:

" మనమున కోరి భజింతున్
తెనాలి రామున్ ప్రగల్భధీవిస్ఫురున్
ధ్వని రాజ్య సార్వభౌము, రు
చి నిరుపమ కవిత్వధాము
సిరిసిరి మువ్వా."

ఇప్పుడిక మన 'ఆటవెలది' ఆట కట్టించడానికి ప్రయత్నిద్దాం.

సంస్కృత సాహిత్యంలో పంచకావ్యాలకు దీటుగా తెలుగులో కూడా జరిగిన పంచ కావ్యాల వింగడింపు తెలిసిందే. అవి వరసగా - 1. మనుచరిత్ర 2.వసుచరిత్ర 3.పాండురంగ మహాత్మ్యము 4.ఆముక్త మాల్యద 5. శృంగార నైషధం. ఈ విభజన శ్రీశ్రీకి విపరీతంగా తోచింది. ఈ ప్రాధాన్య క్రమం గుణగ్రహణ పారీణత్వ బుద్ధితో చేసింది కాదని ఆయన అభిప్రాయం. "కాకి" ఎవరికి ప్రతినిధో "సైకోఎనాలిసిస్" ఎంతటి సార్థక ప్రయోగమో తేటతెల్ల మయింది కదా.

అందువల్ల ఆ ప్రాధాన్య క్రమాన్ని మార్చాలని శ్రీశ్రీ అభిమతం; ఆ మార్పును సూచించడమే 5,3,2 ఆముక్త మాల్యద. ఎట్లాగంటారా? మన పెద్దల విభజనలో 5వ స్థానానికి తోసి వెయ్యబడిన శృంగార నైషధం ప్రథమ స్థానానికి రావాలి. తృతీయంగా ఉన్న పాండురంగ మహాత్మ్యం ద్వితీయం కావాలి. 2వ స్థానంలోని వసుచరిత్ర 3లో కూర్చోవాలి. ఆముక్త మాల్యద స్థానం మాత్రం పదిలం; చెక్కుచెదర లేదు.

మళ్లీ ఇక్కడొక ముడి - పంచ కావ్యాలు కదా, నాలుగే వస్తున్నాయే? పెద్దనగారి పీఠం కదిలి పోయింది కదా. కాబట్టి గొప్ప కావ్యాలు నాలుగేనని శ్రీశ్రీ నిష్కర్ష. లేదా కడన ఖాళీగా ఉన్న జాగాలో ముందు నుంచి తీసిన పెద్దన గారి పీటను వేస్తె ఆయనకు అభ్యంతరం లేకపోవచ్చు.

శ్రీశ్రీ ఎంత కాదన్నా, సర్రియలిజంలో - కనీసం వేప కాయంతైనా సరే - "వెర్రి" వున్నమాట నిజం. అయితే అది బుర్రకు వేడినెక్కించి, వాడినిస్తుందనడం కూడా అసందిగ్ధమైన నిజం.

జిల్లావార్తలు

5వ పేజీ కొరవ

పోలీసులు రంగంలోకి దిగి తీగ లాగితే డొంకంతా కదిలింది. కామిరెడ్డి వెంకటరెడ్డిది ప్రకాశం జిల్లా రాయంవారి పల్లెట. తిరువళ్లూరు రైల్వే స్టేషన్‌లో గతంలో ఎ.ఎస్.ఎం.గా పనిచేసి, భార్యమీద అనుమానంతో ఆమెను హత్య చేశాడట. ఈ కేసులో యావజ్జీవ శిక్ష అనుభవించి జైలు నుంచి విడుదలై ఈ విధమైన మోసాలు చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిసింది. వెంకటరెడ్డికి సహకరించిన తోట సుబ్బారావును కూడా అరెస్ట్ చేసి గూడూరు పోలీసులు కోర్టుకు హాజరు పర్చారు.

ఈ రోడ్డులో ప్రయాణం ప్రాణాంతకం!

రాపూరు - పొదలకూరు రోడ్డులో ప్రయాణం ప్రాణాంతకంగా తయారయ్యింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొదలకూరు నుండి 8కిలో మీటర్ల పొడవునా రోడ్డు బాగా దెబ్బ తినింది. ఇనుకుర్తి, మర్రిపల్లి మధ్య రోడ్డు మార్జిన్ బాగా కొట్టుకపోయి గోతులు పడిపోయాయి. ఈ రూటులో రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు అనేక సమస్యలు ఉత్పన్న మౌతున్నాయి. పొదలకూరు, డేగపూడి మధ్య గుంటలే తప్ప రోడ్డు కనపడటం లేదు.రోడ్లు, భవనాల శాఖాధికారులు ఈ రోడ్డుకు కనీస మరమ్మత్తులు చేయించను శ్రద్ధ వహించడం లేదు. ఎమ్మెల్యే గారు ఒకసారి ఈ మార్గాన పయనిస్తే ప్రజల కష్టం తెలుస్తుంది.

ఆర్.ఎం.పి డాక్టర్ల సమావేశం

జిల్లాలోని ఆర్.ఎం.పి డాక్టర్ల సమావేశం రంగనాయకుల పేట పి.ఎం.ఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో జరిగింది. అధ్యక్షత వహించిన డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ ఆర్.ఎం.పి డాక్టర్లు వృత్తి పరంగా ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. ఆర్.ఎం.పిలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలని సమావేశం తీర్మానించింది. డాక్టర్ బాబూరావును జిల్లా ఆర్.ఎం.పి డాక్టర్ల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

డీలర్ల వితరణ

కోనసీమ వరద బాధితుల పట్ల అనంతసాగరం మండలంలోని రేషన్ షాపుల డీలర్లు వితరణ చూపారు. డిసెంబరు నెల బియ్యం పంపిణీలో కమీషన్ 11,700 రూపాయలను ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపినట్లు డీలర్ల యూనియన్ అధ్యక్షురాలు ఎం. పద్మమ్మ తెలియ జేసారు.

50 ఏళ్లక్రితం

3వ పేజీ కొరవ

ఈ వారం కమ్యూనిష్టు ఆఫీసు మీద జండా మార్పుకు బదులు కమ్యూనిష్టు ఆఫీసే అక్కడి నుండి మారిపోయింది.

కలెక్టర్‌ను జీదగారు 1తేది ఇంగ్లీషు నూతన సంవత్సరాది సందర్భంలో ఒకటి శాసించాడట. తన క్రింది ఉద్యోగస్తు లెవ్వరూ ఒకటో తేది తన్ను చూడ నక్కరలేదనీ, తనకూ, వారికీ ఇదే నూతన సంవత్సరాది కాదు కాబట్టి దీన్ని పాటించ నక్కర లేదన్నారట.

భేష్: మంచి మాటన్నావయ్యా.

***

గోపాలురెడ్డి గారు 2తేది సాయంత్రం టవున్‌లో తిప్పరాజు సత్రం వద్ద ప్రజాపరిషత్తును గూర్చి ఉపన్యసించిరి.

పల్లెటూళ్లు

ముప్పాళ్ల

మా రేషన్ డీలరు జిల్లా కాంగ్రెసుకు, తాలూకా కాంగ్రెస్‌కు సభ్యుడు. పేదల రేషన్ దొంగ మార్కెట్టులో అమ్ముతుంటే పట్టుకొన్నారటనే! యేమయింది?

గ్రామస్తుడు

మల్లాం

శెట్టిగారూ, వచ్చేకోటా గుడ్డను క్రమంగా పంచి పెడతావా లేదా?

నెల్లూరు సంగతులు

నాలుగవ పేజీ కొరవ

ర్యాంకు, కోట మండలం అల్లంపాడు వి.ఎ.ఓ పి.రాజారాం 89.5 మార్కులతో సెకండ్ ర్యాంక్ సాధించారు. మునసబు పరీక్షల్లో కావలి మండలం చలంచర్ల వి.ఎ.ఓ శివరాజా వెంకట సుబ్బారావు ఫస్ట్ ర్యాంకు, మర్రిపాడు వి.ఎ.ఓ సి.హెచ్. నాగేశ్వరరావు సెకండ్ ర్యాంకు సాధించినట్లు పరీక్షల నిర్వాహకుడు, జిల్లా రెవిన్యూ అధికారి డి. త్యాగరాజా తెలియ జేశారు.

విలేఖరుల శిక్షణా తరగతుల్లో మార్పులు!

ఎ.పి.యు.డబ్ల్యు.జె నెల్లూరు శాఖ నిర్వహిస్తున్న గ్రామీణ విలేఖరుల తరగతులు గతంలో ప్రకటించినట్లు గాక ఈ నెల 10,11,12 తేదీల్లో జరుగుతాయి. ప్రఖ్యాత జర్నలిస్ట్ ఖాసా సుబ్బారావు జన్మదినం రోజు వీటిని ప్రారంభించాలని ఈ మార్పు చేశారు. తరగతులను రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి తమ్మినేని సీతారాం ప్రారంభిస్తారు. ఐదు శాఖల మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి,

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి ఛైర్మన్ కె. శ్రీనివాసులు రెడ్డి, ఆంధ్రప్రభ మాజీ ఎడిటర్ పొత్తూరు వెంకటేశ్వరరావు, నెల్లూరు ఎమ్మెల్యే శ్రీమతి లక్ష్మి, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కార్యదర్శులు ఎ. ఆంజనేయులు, డి.కృష్ణారెడ్డి పాల్గొంటారు. జర్నలిజంలో నిష్ణాతులైన వారు గ్రామీణ జర్నలిస్టులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తారని యూనియన్ కార్యదర్శి ఎం.డి. సిరాజ్ తెలియ జేస్తున్నారు.

కాంగ్రెస్ బిసి సెల్‌కు కొత్త కార్యవర్గం

జిల్లా కాంగ్రెస్ పార్టీలోని బిసి సెల్ కార్యవర్గాన్ని రాష్ట్ర బిసి సెల్ ఛైర్మన్ ఎన్. నరసప్ప విస్తృత పరిచా... జిల్లా ఉపాధ్యక్షులుగా టి. తిరిపాలు, వై. శంకరయ్య, కార్యదర్శులుగా పి. ఆనందాచారి, బి.సురేష్ బాబు, మహిళా సెల్ అధ్యక్షురాలిగా శ్రీమతి చల్లా రామమ్మను నియమించారు. టౌన్ బిసి సెల్ అధ్యక్షునిగా బెల్లంకొండ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఎం. వెంకట్రావులకు నియామక ఉత్తర్వు లిచ్చారు.

వినియోగదార్ల సంఘంలో చేరండి!

జిల్లా ప్రజలు చైతన్య వంతులై నప్పటికీ వినియోగ దార్ల హక్కుల విషయంలో వెనుకబడి వున్నారని, వినియోగ దారుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి. కృష్ణయ్య చెప్పారు. ఈ కొరత తీర్చేందుకు ఈ యేడాది చైతన్య శిబిరాలు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలియ జేశారు. వంటగ్యాసు, టెలిఫోన్, విద్యుచ్ఛక్తి వంటి శాఖల్లో వినియోగదార్ల హక్కులు బాధ్యతలు తెలియ జేస్తూ - ఆ శాఖల ఉన్నతాధికార్లతో సూచనలు అందించే ఏర్పాట్లు కూడా చేస్తున్నారట. జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఈ సంఘంలో చేరాలని ఏదైనా వివరాలు కావాల్సి వస్తే, జిల్లా వినియోగదార్ల సంఘాల సమాఖ్య, 15/186, బృందావనం -నెల్లూరు-1 చిరునామాలో సంప్రదించమని కోరుతున్నారు.

సినిమా

9వ పేజీ కొరవ

సంగీత విద్వాంసుడి సంగీత దర్శకత్వమా?

రోజారమణి, ఎస్.వి.రంగారావు, అంజలీదేవి ప్రధాన పాత్రధారులుగా ఎ.వి.ఎం. సంస్థ నిర్మించిన " భక్తప్రహ్లాద" చిత్రానికి ఎస్.రాజేశ్వరరావు సంగీత దర్శకుడు. ఆ చిత్రంలో నారదుడుగా మంగళంపల్లి బాలమురళీ కృష్ణను బుక్ చేయబోతున్నారని తెలియగానే" చాలా సంతోషం. అంతా బాగానే ఉంది. కాని, అంతటి విద్వాంసుడికి నేను ట్యూన్ నేర్పించి, పాడించటమేమిటి అపచారం!" అన్నాడు రాజేశ్వరరావు.

ఓం సాయి తేజస్విని ఫిలిమ్స్ చిత్రం

నవీన్ తుఫాన్ బాధితుడు. పొట్ట పోషించుకోడానికి ఒక నగరానికి వస్తాడు. ఆ పట్టణంలో ఒక టీ కొట్టు పెడతాడు. ఎదురుగా ఇంట్లో ముగ్గురు యువతు లుంటారు. వాళ్ళకు నవీన్ టీ సప్లయ్ చేస్తుంటాడు. ఆ ముగ్గురు యువతులూ ఒకరికి తెలియ కుండా మరొకరు అతడ్ని ప్రేమించేయడం మొదలెడ్తారు. చివరికి అతను ఎవర్ని మనువాడు తాడన్నది సంభ్రమాశ్చర్యాలు కలిగిస్తాయని డైరెక్టర్ తెలియ పర్చారు. నవీన్ సరసన ప్రేమ, హీరా, రుచితా ప్రసాద్‌తో పాటు చంద్రమోహన్, కోట శ్రీనివాసరావు, బాబూమోహన్, గిరిబాబు, చలపతిరావు, మల్లికార్జునరావు, జగ్గారావు, శ్రీలక్ష్మి నటిస్తున్నారు. సి. శ్రీధర్‌రెడ్డి సమర్పణలో చిన్నచౌదరి, అంజిరెడ్డి నిర్మాతలు.

"ఆహ్వానం"

"లవ్, సెంటిమెంట్, కామెడీ సమపాళ్ళలో మిక్స్ అయి ఉంటాయి గనుక "ఆహ్వానం" అనే టైటిల్‌ని పెట్టాం ", అన్నారు నిర్మాత టి. త్రివిక్రమరావు. ప్రేక్షకులను ఆకర్షించడానికి "ఆహ్వానం" కరెక్ట్ అనిపిస్తుం దెవరికైనా. పైగా ఎస్.వి. కృష్ణారెడ్డి దర్శకత్వం వహించే చిత్రమాయె! శ్రీకాంత్, రమ్యకృష్ణ, సత్యనారాయణ, ఆలీ, కోట శ్రీనివాసరావు, బ్రహ్మానందం, బాబూ మోహన్, ఎ.వి.ఎస్., తనికెళ్ళ భరణి, రాళ్ళపల్లి, శివాజీరాజా, గుండు హనుమంతరావు, వై. విజయ, శ్రీలక్ష్మి పాత్రధారులు. మాటలు: దివాకర్‌బాబు. కథ, స్క్రీన్‌ప్లే, సంగీతం, దర్శకత్వం: ఎస్.వి.కృష్ణారెడ్డి.

తెరవెనుక నుంచి తెర ముందుకు

డైరెక్టర్ ఇ.వి.వి. సత్యనారాయణ నిండాపాటిగా చిత్రాలు రూపొందిస్తున్నంత కాలం ఆ చిత్రాలు బాగా ఆడాయి. దర్శకుడుగా మరీ బిజీ అయిపోయే సరికి కాన్‌సెన్‌ట్రేషన్ తగ్గి, చిత్రాల క్వాలిటీ బాగా తగ్గిపోయింది. ఇటీవల విడుదలైన చిత్రాలేవీ ఆయన వెనుకటి చిత్రాల స్థాయిలో విజయవంతం కాలేదు. అంచేత త్వరలో విడుదలయ్యే "చిలకకొట్టుడు" చిత్రం టైటిల్ ఎబ్బెట్టుగా ఉన్నా ఆ చిత్రంలో మహిళలను కించపరిచే సన్నివేశా లుండవని ఆయన ఇటీవల ఒక స్టేట్‌మెంట్ పారేశాడు. అసలా చిత్రంలో కథ అంటూ లేకపోయినా కథనం ఉందట! అందుకోసం ఈ చిత్రాల చివరన పతాక సన్నివేశంలో ఈయన దర్శనమిచ్చి కాస్త వ్యాఖ్యానం వెలగబెట్టారట. పైగా ఇదొక గొప్ప ప్రయోగంగా ప్రేక్షకులు భావించాలట. ఈ "చిలకకొట్టుడు" చిత్రం కోసం బెల్జియమ్, ఫ్రాన్స్, జర్మనీ, ఆంస్టర్ డామ్‌లలో పాటల చిత్రీకరణ కోసం 85లక్షలు వ్యయం చేశారట. ఈ హంగులన్నీ కథలేని చిత్రాన్ని ఆడిస్తాయా?

ప్రిన్సిపల్ సబ్ జడ్జి గారి కోర్టు, తెనాలి

O.S. 17 of 80 / E.P. 14 of 88

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, నాచారం యిండస్ట్రియల్ ఏరియా బ్రాంచి రెప్రజెంట్స్ యిట్స్ బ్రాంచి మేనేజరు ... DHR

M/s. ఇండియన్ మైక్రోసెరిమిక్స్ ఇండస్ట్రీస్, వగైరాలు ... JDRs

వేలం ప్రకటన

పై నెంబరులోని DHR, 2వ JDRతాల్కు యీ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు వారి యెదుట 30.1.97తేదిన వేలంకు తీసుకు వచ్చినారు. సదరు 30.1.97న పైకోర్టులో వేలం జరుగును పాటలో పాల్గొన దలచినవారు పైకోర్టు వారి యెదుట 30.1.97న హాజరయి పాట పాడుకొన వచ్చును.

గుంటూరు డిస్ట్రిక్ట్, చేబ్రోలు స.రి. పెనుగుదురుపాడు గ్రామంలోని 2వ JDRతాల్కు వేలం కావలసిన స్థిరాస్థి వివరం:

1. 496 1/2చ.అ. రాజవీధిలోని గ్రామ కంఠం స్థలం అందులోని యింటికి హద్దులు:- తూర్పు: యితరులకు చెందిన యిల్లు; దక్షిణం: యితరులకు చెందిన యిల్లు; పడమర: రోడ్డు; ఉత్తరం: ఖాళీ స్థలంనకు అనుకొని యున్న రోడ్డు
   DHR కిమ్మతు రు.5000/- Amin కిమ్మతు రు.7000/-
2. డి.నెం.41/19 యం0.27 సెంట్లలో యం0.03 3/4సెంట్ల యిండ్ల స్థలం పెనుగుదురుపాడు గ్రామం. హద్దులు: తూర్పు: శ్రీమతి V.పున్నమ్మ భూమి; దక్షిణం: దేవాలయం యొక్క కాంపౌండ్; పడమర: V.V. సుబ్బయ్య గారి భూమికి ప్రక్క గల్లీ; ఉత్తరం: యితరుల భూమి.
   DHR కిమ్మతు రు.5000/- Amin కిమ్మతు రు.7875/-
3. డి.నెం.42/4 యం0.08 సెంట్లలో యం0.02 సెంట్ల యిళ్ళ స్థలంకు హద్దులు. తూర్పు: శ్రీ వి. పుగ్గయ్య గారి భూమి; దక్షిణం: N. పితయ్య గారి భూమి; పడమర: యితరుల భూమి; ఉత్తరం: యితరుల భూమి
   DHR కిమ్మతు రు.4000/- Amin కిమ్మతు రు.4200/-

IInd Item: గుంటూరు జిల్లా, చేబ్రోలు సబ్‌రిజిష్ట్రారు పర్లమూడి గ్రామంలో యున్న 2వ JDRతాల్కు వేలం కానున్న స్థిరాస్తి వివరం: D.No.738/1 విస్తీర్ణం AC 0.97cts of Wet Land హద్దులు: తూర్పు: V. నరసింహారావు భూమి; దక్షిణం: V. భాస్కరరావు భూమి; పడమర: వెంకటరంగయ్య మరియు ఇతరుల భూమి; ఉత్తరం: V. తాతయ్య భూమి

DHR కిమ్మతు రు.25000/- Amin కిమ్మతు రు.50,000/-

వేలం తేది 30.1.97; F.Hg. 6.2.97

T.S. బాహిరాజా శర్మ

DHR తరఫున అడ్వకేటు

96 - స్వగతం : 97 - స్వాగతం!

-జయంపు కృష్ణ

భూ అటవీ - యూరియా కుంభకోణాలు
మట్టితైలం - డ్రగ్ - ఆయుర్వేద స్కాములు
టెలికాం - పవర్‌లూమ్ - పెట్రోలియమ్
హవాలా - హౌసింగ్ - మెడికల్ - బాంక్ వగైరాలు
అధికార, రాజకీయ ఆయారామ్ గయారామ్‌లు-
దక్షిణ పసిఫిక్‌లో ఫ్రాన్స్ అణుపరీక్ష
మాడ్ కౌ భయంతో గోమాంసంపై ఆంక్ష-
రష్యా దాడిలో చెచెన్యా దుబయేవ్ హతం
జల సమాధి అయిన టాంజీనియా నౌకా ప్రమాదం-
ఆంగ్ సూకీపై మిలటరీ ఉక్కుపాదం
సోమాలియాలో ఆకలి ఆర్తనాదం-
బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా నేతృత్వం
ఆస్పత్రి పాలయినా ఆగని థెరిస్సా మాతృత్వం-
పాకిస్తాన్‌లో బెనజీర్ భుట్టో ప్రహసనం
జయలలిత పందకోట్ల పెళ్లి ప్రభంజనం-
శ్రీలంకలో పులుల భీషణ పోరాటం
కాశ్మీర్‌లో కిడ్నాపుల విడుదల ఆరాటం-
తెగ నరుక్కుంటున్న బురుండీ వైషమ్యాలు
తునాతునకలుగా వైమానిక పతనాలు-
చార్లెస్ - డయానాల శృంగార దుమారాలు
కాబూల్ తాలిబాన్ల పురాతన యవారాలు-
నిరసనల మధ్య ప్రపంచ సుందరి ఇరెనాస్కీవా
యు.ఎన్.ఓ. కార్యదర్శిగా కోఫీఅన్నాన్ ఎంపిక-
ప్రపంచ తెలుగు మహాసభల మహోత్సవం
ఓట్ల వాగ్దానాలతో ప్రభుత సతమతం-
వద్దు మనకు ఈ చిత్రవిచిత్ర 96 - స్వగతం
ముద్దు అభ్యుదయ భావ సంచయిక 97 - స్వాగతం!

నేటి భారతం

2 వ పేజీ కొరవ

చేయబడినాయి. వీటి వాడకం వల్ల జ్ఞాపక శక్తి పెరగడమేకాక, శరీరారోగ్యం కూడా మెరుగవుతున్న దంటున్నారు! లెటస్ ట్రై వన్స్!

నీ ఇల్లు బంగారం గాను!

కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ పి. చిదంబరం గారు నీఇల్లు బంగారం గాను అంటూ దీవిస్తున్నారు ప్రవాస భారతీయులను! కనీసం ఆర్నెల్లపాటు విదేశాలలో వుండి ఆపైన ఇండియాకు తిరిగొచ్చే భారతీయులు ఇప్పుడు దిగుమతి సుంకాలు చెల్లించి పది కిలోల వరకు బంగారం పట్టుక రావచ్చు. ఇది వరకు 5 కిలోల బంగారానికి మాత్రమే అనుమతి వుండేది. ఇలా బంగారం దిగుమతిని సరళ తరం చేయడం వల్ల ఒకే దెబ్బకు రెండు పిట్టలు అంటున్నారు

ఆర్థిక మంత్రి. బంగారం స్మగ్లింగ్ తగ్గిపోవడం మొదటి లాభం. దిగుమతి సుంకాల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పెరగడం రెండవ ప్రయోజనం! ఇతర వస్తువుల దిగుమతిని కుడా ఇలాగే సులభతరం చేస్తే బాగుండదా?

ఆంధ్రప్రదేశ్‌లో అసత్య శోధిని!

ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ 'అసత్యశోధిని'ని సాధించి తెచ్చుకొంది. దీని ఖరీదు 4లక్షలు మాత్రమే! ఇటు వంటి యంత్రాలు మన దేశంలో ఇప్పటికి రెండే వున్నాయట! ఒకటి సి.బి.ఐ చేతుల్లో వుంది. రెండోది

గుజరాత్ పోలీసుల వద్ద వుంది - ఈ 'అసత్యశోధిని'ని పోలీసు శాఖలోనే ప్రయోగిస్తారట! దీని వల్ల నేరవిచారణ సులభతర మౌతుందంటున్నారు. ముందుగా దీనిని మన ముఖ్యమంత్రి పైనే ప్రయోగిస్తారా కొంపదీసి?

నాస్తిక 'దేవుడు'

తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి యిటీవల మధురైకి వచ్చినప్పుడు డిఎంకె కార్యకర్తలు, అభిమానులు భారీ పోస్టర్లతో ఆయనకు బ్రహ్మరథం పట్టారు. కానీ ఆ పోస్టర్లను చూసి ఆయన మండి పడ్డారు - వాటిల్లో ఆయనను 'కడవుళ్'గా (దేవుడు) సంబోధించారు. నేను నాస్తికుడిని అని అంతా అనుకొంటుంటే, మీరిలా అంటే, ఆ దేవుడు ఏమను కొంటాడు? అని కరుణానిధి విసుక్కొన్నారు.

Edited, Printed and Published by N. Dolendra Prasad at Zaminryot Press. Offset Printing at Nayagara Paper Products (India) Limited, Nellore